




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 291 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 27 జూన్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 291 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE FRI 27 JUNE 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## ఇజ్రాయెల్‌పై విజయం సాధించాం, అమెరికాను చిత్తు చేశాం



- ఇజ్రాయెల్‌పై ఇరాన్ విజయం సాధించిందని ఖమేనీ ప్రకటన
- 'మోసపూరిత జియోనిస్ట్ పాలన'ను చిత్తు చేశామని వ్యాఖ్య
- అమెరికా జోక్యం చేసుకున్నా ఫలితం శూన్యమన్న ఇరాన్

పెన్ పవర్ డెస్క్:ఇజ్రాయెల్‌పై ఇరాన్ 'విజయం' సాధించిందని, అమెరికాను కూడా చావుదెబ్బ తీశామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్‌ను నేరుగా ప్రస్తావిం చకుండా, "మోసపూరిత జియోనిస్ట్ పాలన" అంటూ సంబోధించారు.

వివరాలు 2లో..

## డ్రగ్స్ తీసుకున్న నటులను ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలి

- తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదామన్న దిల్ రాజు
- డ్రగ్స్ తీసుకున్న నటులను ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలని దిల్ రాజు ప్రతిపాదన
- యువత డ్రగ్స్‌కు అలవాటైతే దేశ భవిష్యత్తు అంధకారమేనన్న విజయ్ దేవరకొండ
- ప్రతి ఒక్కరూ సైనికుడిలా మారి డ్రగ్స్‌ను నిర్మూలించాలన్న రామ్ చరణ్

వివరాలు 2లో..



## కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లోపించింది

- ఏపీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణపై జగన్ ధ్వజం
- రాజ్యాంగ ఉల్లంఘనలంటూ ఆరోపణ
- ఖనిజ సంపద తాకట్టు, సంఘటిత నిధి ప్రైవేటుపరం అంటూ విమర్శలు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను గాలికొదిలేసి, రాజ్యాంగ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, నిధుల సమీకరణ పద్ధతులపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. 2025 జూన్ 25న ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) రెండో విడత నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీలు లేదా బాండ్లు) జారీని పూర్తి చేసిందని, 9.30 శాతం అధిక వడ్డీ (కూపన్) రేటుకు రూ. 5,526 కోట్లు సమీకరించిందని

వివరాలు 2లో..

### రాజమండ్రిలో 'అఖండ గోదావరి'

## పర్యాటక ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేసిన షెకావత్, పవన్ కల్యాణ్

- రాజమండ్రిలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు
- కేంద్రం రూ.375 కోట్లతో రాష్ట్రంలో చేపట్టనున్న పర్యాటక ప్రాజెక్టులు
- ప్రాజెక్టుల ఫోటో గ్యాలరీని తిలకించిన షెకావత్, పవన్
- గోదావరి రివర్ ఫ్రంట్ నుంచి ప్రాజెక్టు ప్రాంతం పరిశీలన
- హాజరైన రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు




పెన్ పవర్ డెస్క్:రాజమండ్రిలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు నిర్మాణానికి గురువారం అంకురార్పణ జరిగింది. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం గోదావరి తీర ప్రాంత అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు.శంకుస్థాపన కార్యక్రమం అనంతరం, కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తున్న రూ.375 కోట్ల నిధులతో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన ఫోటో గ్యాలరీని గజేంద్ర సింగ్ షెకావత్, పవన్ కల్యాణ్ తిలకించారు. అనంతరం, గోదావరి తీరంలోని రివర్ ఫ్రంట్ వ్యూ పాయింట్ నుంచి

వివరాలు 2లో..

# డ్రగ్స్ పై యుద్ధం...

## ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం

- గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటిస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి
- గత ప్రభుత్వం గంజాయి కట్టడిలో విఫలమైందని విమర్శ
- 'ఈగల్' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా గంజాయిపై ప్రత్యేక నిఘా
- 26 జిల్లాల్లో నార్కోటిక్స్ సెల్స్, పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు
- మద్యం ఆదాయంలో 2 శాతం డ్రగ్స్ నిర్మూలనకు కేటాయింపు
- గంజాయి బ్యాచ్‌కు సహకరించిన వారికి గుణపాఠం తప్పదని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబా బు స్పష్టం చేశారు. వీటిపై యుద్ధం ప్రకటిస్తున్నామని, ఈ పోరాటంలో ఎవరు అడ్డువచ్చినా ఉపేక్షించేది లేదని, వారిని తొక్కుకుంటూ ముందుకెళతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో గంజాయి నియంత్రణ పూర్తిగా గాలికొదిలేశారని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడినందుకు టీడీపీ కార్యాలయంపై దాడులు చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.యాంటీ నార్కోటిక్స్ డే సందర్భంగా గురువారం నాడు గుంటూరులో నిర్వహించిన వాకథాన్‌లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం శ్రీకన్వెన్షన్‌లో విద్యార్థులు, యువతతో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. "రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ముఠా కక్షలకు తావులేదు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అణచివేసింది తెలుగుదేశం పార్టీయే. మతసామర స్యాన్ని కాపాడతాం, విద్వేషాలు రెచ్చగొట్టేవారిని ఉపేక్షించం. గంజాయి బ్యాచ్‌కు అండగా నిలిచిన వారికి తగిన గుణపాఠం చెబుతాం" అని సీఎం ఉద్ఘాటించారు.గంజాయి నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు కూడా కలిసిరావాలని కోరారు. "ప్రజలను మెప్పించి ఓట్లు వేయించుకోవాలి కానీ, తప్పుడు పనులతో రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే కుదరదు. 2021లో దేశవ్యాప్తంగా పండిన మొత్తం గంజాయిలో 50 శాతం ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచే ఉత్పత్తి కావడం, దానికి విశాఖపట్నం కేంద్రంగా మారడం తీవ్ర ఆవేదన కలిగించింది" అని ఆయన అన్నారు. గంజాయికి బానిసలవడం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని, యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ

వివరాలు 2లో..

## సీఎం చంద్రబాబును కలిసిన కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్

- ఏపీలో కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పర్యటన
- రాజమండ్రిలో అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన
- అనంతరం ఉండవల్లి రాక... స్వాగతం పలికిన మంత్రి నారా లోకేశ్
- సీఎం చంద్రబాబుతో పలు అంశాలు చర్చించిన షెకావత్

వివరాలు 2లో..



### మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై కేసు..

## ఎంపీపీ అరెస్ట్.. వైసీపీ నేతలకు చిక్కులు!

- మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై బాణసంచా ఘటనలో కేసు
- 2024 ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి, వ్యక్తి కంటికి గాయం
- లోకేశ్ అనే వ్యక్తి కంటిచూపు కోల్పోయిన వైనం
- శ్రీకాంత్ రెడ్డితో పాటు 19 మంది వైసీపీ నేతలపై ఎఫ్ఐఆర్
- ఎంపీపీ సుదర్శన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో చర్యలు



పెన్ పవర్ డెస్క్:అన్నమయ్య జిల్లాలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డితో పాటు పలువురు ఆ పార్టీ నేతలపై కేసు నమోదైంది. 2024 ఎన్నికల ప్రచార సమయంలో బాణసంచా పేల్చడం వల్ల ఓ వ్యక్తి కంటిచూపు కోల్పోయిన ఘటనకు సంబంధించి ఈ కేసు నమోదు కాగా, ఓ నేతను పోలీసులు అదుపులోకి కూడా తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ కార్యకర్తలు లక్కిరెడ్డిపల్లి మండలం అగ్రహారంలో భారీగా బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో జరిగిన అపశ్రుతిలో లోకేశ్ అనే

వివరాలు 2లో..

### ఆరేళ్లుగా పోటీ చేయని రాజకీయ పార్టీలు...

## ఎన్నికల సంఘం కీలక నిర్ణయం!

- ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలపై ఎన్నికల సంఘం చర్యలు
- ఆరేళ్లుగా యాక్టివ్‌గా లేని 345 పార్టీల డీలిస్టింగ్ ప్రాసెస్ షురూ
- సంబంధిత పార్టీలకు కార్యాలయాలు కూడా లేవని గుర్తింపు
- దేశవ్యాప్తంగా 2,800కు పైగా గుర్తింపు లేని నమోదిత పార్టీలు
- వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలపై వేటు

పెన్ పవర్ డెస్క్:దేశంలో రాజకీయ పార్టీగా నమోదు చేసుకుని, ఆరేళ్లుగా ఎటువంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా నిష్క్రియంగా ఉన్న పార్టీలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) దృష్టి సారించింది. 2019 నుంచి ఇప్పటివరకు ఒక్క ఎన్నికలో కూడా పాల్గొనని 345

వివరాలు 2లో..




## క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ అభిప్రాయం తెలపండి

- రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఏర్పాటు
- స్కాన్ చేసి సరుకులు, డీలర్లపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వొచ్చు
- 65 ఏళ్లు పైబడినవారు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ సౌకర్యం
- ఈనెల 26 నుంచే జులై నెల సరుకుల పంపిణీ ప్రారంభం
- నూతన విధానాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహర్

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందిం చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరి యు వినియోగదా రుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల

వివరాలు 2లో..



## డాకింగ్ విజయవంతం...

### అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన శుభాంశు శుక్లా



- యాక్సియం-4 మిషన్ ద్వారా అంతరిక్షంలోకి భారత వ్యోమగామి
- శుభాంశు శుక్లా సహా నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌లో ప్రవేశం
- అమెరికా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ప్రయోగం
- గురువారం సాయంత్రం విజయవంతంగా స్పేస్‌క్రాఫ్ట్ డాకింగ్
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 14 రోజుల పాటు పరిశోధనలు

పెన్ పవర్ డెస్క్:అంతరిక్ష పరిశోధన రంగంలో భారత్ మరో కీలక విజయాన్ని అందుకుంది. యాక్సియం-4 మిషన్ లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు అంతర్జాతీయ వ్యోమగాములతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో

వివరాలు 2లో..

## భారత్‌పై చైనా ఎత్తుగడ! బీజింగ్ నుంచి ఆగిపోయిన స్పెషాలిటీ ఫెర్టిలైజర్స్ సరఫరా



- భారత్‌కు చైనా నుంచి ప్రత్యేక ఎరువుల సరఫరా రెండు నెలలుగా నిలిపివేత
- ఇతర దేశాలకు మాత్రం చైనా ఎగుమతులు యథాతథం
- పంటల దిగుబడి పెంచడంలో ఈ ఎరువులు చాలా ముఖ్యం
- అధికారిక నిషేధం లేకుండానే తనిఖీల పేరుతో చైనా ఎత్తుగడ
- భారత్ వాడే ప్రత్యేక ఎరువుల్లో 80 శాతం చైనా నుంచే దిగుమతి
- ప్రత్యామ్నాయాల కోసం పశ్చిమాసియా, ఐరోపా వైపు భారత్ చూపు

పెన్ పవర్ డెస్క్:గత రెండు నెలలుగా చైనా నుంచి భారత్‌కు ప్రత్యేక ఎరువుల (స్పెషాలిటీ ఫెర్టిలైజర్స్) ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. అయితే, బీజింగ్ ఇతర దేశాలకు మాత్రం ఈ ఎరువులను యథావిధిగా సరఫరా చేస్తుండటం గమనార్హం. పండ్లు, కూరగాయలు వంటి వాణిజ్య పంటలతో పాటు ఇతర పంటల్లో దిగుబడిని గణనీయంగా పెంచడంలో ఈ ప్రత్యేక ఎరువులు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ పరిణామం భారతీయ వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# క్రమ"శిక్ష"ణ ఎక్కడ?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రమంగా పార్టీపైన పట్టుబిగించే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ కు ఎవరూ శత్రువులుండరు. ఆ పార్టీ నేతలే. ఇది ఇప్పుడు మొదలయింది కాదు. దేశంలో ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా లేకపోయినా పైకి పార్టీ లేదే కొర్టీ కిందకు లాగే వాళ్లు ఎక్కువ మంది ఉంటారు. అందుకే చాలా మంది చాలా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు ప్రత్యర్థి పార్టీల నేతల కంటే సొంత పార్టీ నేతలకే ఎక్కువ భయపడుతుంటారు. అందుకు కారణం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది తమ కారణంగానే నని భావించి తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటారు. ఎమ్మెల్యే టిక్కెట్ రాకపోతే.. ఎమ్మెల్సీని అడుగుతారు. అదిస్తే మంత్రి పదవి సంగతేంటని ప్రశ్నిస్తారు.

**అన్నీ గాంధీ భవన్ నుంచి డిమాండ్లే...**

కుటుంబంలో ఒకరికి టిక్కెట్ ఇచ్చి మంత్రిపదవిని ఇచ్చినా మిగిలిన కుటుంబ సభ్యుల మాటేంటని నిలదీస్తారు. ఇక ఎప్పుడూ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయని వారు, వారి వల్ల ఒక్క ఓటు కూడా కాంగ్రెస్ గుర్తుపై వేయించలేని వారు సయితం తమకు పదవులు కావాలని కోరతారు. కోరడమే కాదు గాంధీభవన్ లో కుర్చుని మరీ డిమాండ్ చేస్తారు. ఏకంగా మీడియా సమావేశం పెట్టి సొంత పార్టీ పైన, ప్రభుత్వంపైన విమర్శలు చేయడానికి వెనకాడరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ పాదయాత్రతో కాంగ్రెస్ సుదీర్ఘకాలం తర్వాత అధికారంలోకి వచ్చినా ఆ విజయం తమవల్లనేనంటూ డప్పుకొట్టుకున్న వారు అనేక మంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కూడా అసంతృప్తుల బెడద 2004 ముందు నుంచి ఆయన మరణించేంత వరకూ తప్పలేదు.

**పార్టీపై దృష్టిపెట్టాలనుకుంటున్నా...**

ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండటంతో ఇప్పటి వరకూ పార్టీ విషయాలను పెద్దగా పట్టించుకోలేదు. ఆయన ఎక్కువగా పాలనపైనే ఫోకస్ పెట్టారు. మంత్రి వర్గ విస్తరణ కూడా పూర్తి కావడంతో పాటు స్థానికసంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ కాంగ్రెస్ పార్టీని గాడిలో పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. నియోజకవర్గ స్థాయి నేతలు కూడా మీసాలు మెలేస్తుండటం, సీనియర్ నేతలపైనా, మంత్రులపైనా విమర్శలు చేస్తుండటంతో రేవంత్ రెడ్డి పార్టీ అధినాయకత్వంతో మాట్లాడి క్రమశిక్షణ కమిటీని నియమించుకున్నారు.క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ గా ఉన్న వారు సయితం తమ ఇలాకాలో సొంత పార్టీ నేతలను విమర్శలు చేయడం కొంత ఇబ్బందిగా మారింది. పీసీసీ అధ్యక్షుడిగా హోదాలో మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న హెచ్చరికలు పెద్దగా పనిచేయడంలేదు.

**నాడు జగ్గయ్యపేటలో వైఎస్...**

కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీ అనేది ఒక బ్రహ్మపదార్థం. 1999లో ఒక ఇన్సిడెంట్ గురించి మాట్లాడుకుందాం. అప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్. కృష్ణా జిల్లా పర్యటనకు రోడ్డు మార్గాన బయలుదేరి వచ్చారు. జగ్గయ్య పేట అడ్డరోడ్డువద్ద సామినేని ఉదయభాను అనుచరులు మరొక కాంగ్రెస్ నేతను చితక బాదారు. ఆ నేత వైఎస్ కారులో ఉన్నా సరే కారు అద్దాలు బద్దలు కొట్టి బయటకు లాగి కొట్టారు. వెంటనే నందిగామలోని వసంత నాగేశ్వరరావు ఇంట్లో మీడియా సమావేశం పెట్టిన వైఎస్ సామినేని ఉదయభానును ఆరేళ్ల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఆరు నెలలకు తిరక్కుముందే జరిగిన ఎన్నికల్లో ఉదయ భానుకు టిక్కెట్ వచ్చింది. 1999లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలిచారు.

**ఇప్పుడు మల్లురవి నేతృత్వంలో...**

అట్టుంటిది కాంగ్రెస్ పార్టీ వ్యవహారం. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. తనకు బాగా సన్నిహితుడైన నాగర్ కర్నూలు ఎంపీ మల్లురవిని క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ గా నియమించారు. ఈ కమిటీ బెదిరింపులకు కాంగ్రెస్ నేతలు తలొగ్గుతారా? తోకముడుస్తారా? అంటే నవ్వడం మినహా మరొక సమాధానం రాదు. కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ అంటే కోరలు లేని పాము వంటిదని కార్యకర్తల నుంచి నేతల వరకూ అందరికీ తెలుసు. అందుకే ఇప్పుడు ఏర్పడిన క్రమశిక్షణ కమిటీ పార్టీ నేతలపై చర్యలు తీసుకుంటారని భావించడం అత్యాశే అవుతుంది. కొండా మురళిపైనో, మరొకరిపైనో వేటు వేసే ధైర్యం కాదు కదా... కాదు... నిర్ణయం తీసుకునే హక్కు ఈ కమిటీకి లేదనే చెప్పాలి. అందుకే హస్తం పార్టీ అలా ఎప్పుడూ వెలిగిపోతుంది.ం

# కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లోపించింది

- మొదటి పేజీ తరువాయి

జగన్ తెలిపారు. దీంతో మొత్తం బాండ్ల విలువ రూ. 9,000 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏపీ హైకోర్టులో కేసు విచారణలో ఉందని, నోటీసులు కూడా జారీ అయ్యాయని గుర్తుచేశారు. ఈ బాండ్ల ద్వారా సమీకరించిన నిధులను ప్రభుత్వ రెవెన్యూ వ్యయాల కోసం వినియోగిస్తున్నారని స్పష్టమవుతోందని ఆయన ఆరోపించారు.రాజ్యాంగ నిబంధనలను పూర్తిగా విస్మరించి, అపూర్వమైన రీతిలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రైవేటు పార్టీలకు రాష్ట్ర సంఘటిత నిధిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించిందని జగన్ దుయ్యబట్టారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్వారా డైరెక్ట్ డెబిట్ ఆదేశాలు జారీ చేసి, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేకుండానే ప్రైవేటు వ్యక్తులు రాష్ట్ర ఖజానా నుంచి నిధులు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204, 293(1) లను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు.ఎన్‌సీడీ బాండ్లకు అదనపు హామీగా, గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,91,000 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి అయిన ఖనిజ సంపదను కేవలం రూ. 9,000 కోట్ల బాండ్ల కోసం తాకట్టు పెట్టిందని జగన్ విమర్శించారు. రాష్ట్ర సంఘటిత నిధికి ఇలా ప్రైవేటు వ్యక్తులకు అనుమతి ఇవ్వడం, ఇంత భారీ మొత్తంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం చూస్తుంటే, ఈ బాండ్లు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే రాష్ట్ర అభివృద్ధి రుణాల (ఎస్‌డీఎల్) కంటే ఎక్కువ సురక్షితమైనవిగా భావించాలా? అని వ్యాఖ్యానించారు.అయినప్పటికీ, ఏపీఎండీసీ బాండ్లను 9.30 శాతం అధిక వడ్డీ రేటుకు జారీ చేశారని, ఇది ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధి రుణాలపై ఉన్న వడ్డీ రేటు కంటే 2.60 శాతం ఎక్కువని జగన్ తెలిపారు. ఈ అధిక వడ్డీ రేటు కారణంగా ఏపీఎండీసీపై ఏటా అదనంగా రూ. 235 కోట్ల భారం పడుతుందని, ఈ బాండ్ల కాలపరిమితి పదేళ్లుగా ఉందని తెలిసిందని అన్నారు. ఈ అదనపు భారం వల్ల లబ్ధి పొందింది ఎవరో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు.ఈ ఎన్‌సీడీల జారీతో, టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ 13 నెలల కాలంలో సమీకరించిన బడ్జెట్, ఆఫ్–బడ్జెట్ రుణాలు, గత ప్రభుత్వం ఐదేళ్లలో తీసుకున్న రుణాల్లో 50 శాతానికి పైగా ఉన్నాయని జగన్ ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, ప్రభుత్వ రుణాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, పారదర్శకత పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ అభిప్రాయం తెలపండి

- మొదటి పేజీ తరువాయి

మనోహర్ స్పష్టం చేశారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో పలు కీలక సంస్కరణలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారుల అభిప్రాయాలు, ఫిర్యాదులను నేరుగా స్వీకరించేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

**క్యూఆర్ కోడ్‌తో నేరుగా మీ స్పందన**

రేషన్ కార్డుదారులు తమ స్మార్ట్‌ఫోన్లతో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఒక వెబ్ ఫారమ్‌లోకి ప్రవేశిస్తారని మంత్రి నాదెండ్ల వివరించారు. ఈ ఫారమ్‌లో ఆ నెల రేషన్ సరుకులు అందుకున్నారా? లేదా? సరుకుల నాణ్యత ఎలా ఉంది? తూకంలో ఏమైనా తేడాలున్నాయా? రేషన్ డీలర్ ప్రవర్తన, ఏవైనా అధిక ధరలు వసూలు చేశారా? వంటి ప్రశ్నలకు "అవును" లేదా "కాదు" అనే సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులు నమోదు చేసే ఈ వివరాలు, అభిప్రాయాలు నేరుగా ఉన్నతాధికారులకు చేరుతాయని, దీనివల్ల సమస్యలున్న చోట తక్షణమే చర్యలు తీసుకునేందుకు వీలు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం ద్వారానే పౌర సేవలను మరింత మెరుగుపరచాలన్నది మా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

**వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యం**

మరో కీలక నిర్ణయంగా 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఇవాళ్టి నుంచే ప్రారంభించినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. వీరికి ఐదు రోజుల ముందుగానే రేషన్ అందజేయనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా జులై నెలకు సంబంధించిన రేషన్ సరుకుల పంపిణీని కూడా నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు.

# ఇజ్రాయెల్‌పై విజయం సాధించాం, అమెరికాను చిత్తు చేశాం

- మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ఆయన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. "ఎంత గందరగోళం సృష్టించినా, ఎన్ని ప్రకటనలు చేసినా, జియోనిస్ట్ పాలన ఆచరణాత్మకంగా ఇస్లామిక్ రిపబ్లిక్ దెబ్బలకు చిత్తయి, నలిగిపోయింది" అని ఖమేనీ ఒక పోస్టులో పేర్కొన్నారు. దేశ ప్రజలకు ఈ 'విజయం' పట్ల అభినందనలు అంటూ పోస్టు చేశారు.ఆ వెంటనే అమెరికాను లక్ష్యంగా చేసుకుని మరో పోస్ట్ చేశారు. "మన ప్రియమైన ఇరాన్ అమెరికా ప్రభుత్వంపై సాధించిన విజయానికి నా అభినందనలు. జియోనిస్ట్ పాలన పూర్తిగా నాశనమవుతుందని భావించిన అమెరికా ప్రభుత్వం, దానిని కాపాడేందుకే నేరుగా యుద్ధంలోకి దిగింది. కానీ ఏమీ సాధించలేకపోయింది" అని ఖమేనీ అన్నారు.గల్ఫ్‌లో మోహరించిన అమెరికా దళాలపై ఇరాన్ ప్రతీకార దాడిని కూడా ఖమేనీ ప్రస్తావించారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ అమెరికా చెంప చెళ్లుమనిపించింది. ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా స్థావరాల్లో ఒకటైన అల్–ఉదీద్ వైమానిక స్థావరంపై దాడి చేసి నష్టం కలిగించింది" అని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలోని అమెరికా ఆస్తులపై ఇరాన్ ఎప్పుడైనా దాడి చేయగల సత్తా కలిగి ఉందని ఖమేనీ మరో పోస్టులో హెచ్చరించారు. "ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా కేంద్రాలను ఇస్లామిక్ రిపబ్లిక్ చేరుకోగలగడం, అవసరమని భావించినప్పుడల్లా చర్యలు తీసుకోగలగడం ఒక ముఖ్యమైన విషయం. భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్య పునరావృతం కావచ్చు. ఏదైనా దురాక్రమణ జరిగితే, శత్రువు కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు.

# డ్రగ్స్ తీసుకున్న నటులను ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలి

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణను మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, ఈ విషయంలో సినీ పరిశ్రమ కూడా కీలక పాత్ర పోషిస్తుందని ఎఫ్‌డీసీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయనతో పాటు నటులు విజయ్ దేవరకొండ, రామ్ చరణ్ పాల్గొని డ్రగ్స్‌పై తమ గళం విప్పారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, యువతకు దిశానిర్దేశం చేశారు.దిల్ రాజు మాట్లాడుతూ, మలయాళ చిత్ర పరిశ్రమలో డ్రగ్స్ తీసుకున్న వారిని బహిష్కరించే నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. "అక్కడ ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్లు తేలితే, వారిని పరిశ్రమ నుంచి బహిష్కరిస్తారు. తెలంగాణ ఎఫ్‌డీసీ తరపున తెలుగు చిత్ర పరిశ్రమ తరపున నేను కోరేది ఒక్కటే. మన దగ్గర కూడా అలాంటి సంఘటనలు జరిగితే సంబంధిత వ్యక్తులను ఇండస్ట్రీలో అడుగు పెట్టకుండా నిషేధించాలి. అప్పుడే సమాజానికి బలమైన సందేశం వెళుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని చిత్ర పరిశ్రమ పెద్దలతో చర్చించి, తెలుగు సినిమాల్లో కూడా ఈ నిబంధన పాటించేలా చర్యలు తీసుకుంటామని, ఇది మనందరి కర్తవ్యమని దిల్ రాజు పేర్కొన్నారు. డ్రగ్స్ లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు అంతా ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, తాను సాధారణంగా బయటి ప్రపంచానికి దూరంగా ఉంటానని, అయితే యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ ప్రాముఖ్యతను పోలీస్ అధికారులు వివరించిన తర్వాత దీనిపై మాట్లాడటం బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. "ఒక దేశాన్ని నాశనం చేయాలంటే యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. ఆ దేశ యువతకు డ్రగ్స్ అలవాటు చేస్తే సరిపోతుంది. కొన్ని దేశాలు మన యువతకు మత్తు పదార్థాలు అలవాటు చేసి, దేశ భవిష్యత్తును దెబ్బతీయాలని చూస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తాయని, ఒక్కసారి వాటికి బానిసైతే కోలుకోవడం చాలా కష్టమని హెచ్చరించారు. స్నేహితులు డ్రగ్స్ అలవాటు చేస్తే వారికి దూరంగా ఉండాలని, అందరూ ఆరోగ్యంగా ఉంటూ, వ్యాయామం చేస్తూ, తల్లిదండ్రులకు గౌరవం తెచ్చే పనులు చేయాలని సూచించారు. విజయం, డబ్బు, గౌరవం లేని పనులు చేయడం అనవసరమని ఆయన అన్నారు.అనంతరం నటుడు రామ్ చరణ్ మాట్లాడుతూ, తన చిన్నతనంలో పాఠశాల తరపున ఇలాంటి అవగాహన కార్యక్రమాలకు వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. "ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. గతంలో కొన్ని పాఠశాలల బయట డ్రగ్స్ అమ్ముతున్నారని తెలిసి చాలా బాధపడ్డాను. అప్పుడు నేను తండ్రిని కాదు, కానీ ఇప్పుడు నేనొక తండ్రిని" అని ఆయన అన్నారు.ఒక మంచి సినిమా చేసినప్పుడు, పరీక్షల్లో మంచి మార్కులు వచ్చినప్పుడు, స్నేహితులతో ఆడుకున్నప్పుడు కలిగే ఆనందం గొప్పదని, రోజూ వ్యాయామం చేస్తూ నచ్చిన పని చేసుకుంటూ కుటుంబంతో సంతోషంగా ఉండాలని యువతకు సూచించారు. '

'మన కుటుంబంతో మొదలుపెట్టి, పాఠశాల, సమాజాన్ని బాగు చేసుకుందాం. ఈ విషయంలో పోలీసు శాఖ చేస్తున్న కృషి అభినందనీయం. ప్రతి ఒక్కరూ ఒక్కో సైనికుడిలా మారి డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం" అని రామ్ చరణ్ పిలుపునిచ్చారు.

# డ్రగ్స్ పై యుద్ధం...

- మొదటి పేజీ తరువాయి

విలువైన జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల మెడికల్ షాపుల్లో కూడా మత్తుపదార్థాలు అమ్ముతున్నారన్న సమాచారం ఉందని తెలిపారు. "గంజాయిపై రాష్ట్రవ్యాప్తంగా 'ఈగల్' పేరుతో డేగ కన్ను వేసి ఉంచుతాం. ఇప్పటికైనా మారకపోతే అలాంటి వారు రాష్ట్రంలో ఉండేందుకే అనర్హులు. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది" అని తీవ్రంగా హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, "రాష్ట్రంలోని 26 జిల్లాల్లో నార్కోటిక్స్ సెల్స్ ఏర్పాటు చేశాం. పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌లు నెలకొల్పాం. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే '1972' నంబర్‌కు మెసేజ్ పంపితే తక్షణమే రక్షణ చర్యలు తీసుకుంటాం. మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో 2 శాతాన్ని డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాలకు కేటాయిస్తాం. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో 56 డీ–అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సినీనటులు కూడా ముందుకు రావాలని, ప్రజా చైతన్యం కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆరేళ్లుగా పోటీ చేయని రాజకీయ పార్టీలు... ఎన్నికల సంఘం కీలక నిర్ణయం!

- మొదటి పేజీ తరువాయి

గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలను (రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీస్ – ఆర్‌యూపీపీ) గుర్తించి, వాటిని డీలిస్ట్ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఈ పార్టీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో వాటి కార్యాలయాలు కూడా ఉనికిలో లేవని ఎన్నికల సంఘం తన పరిశీలనలో గుర్తించింది. ఈ నేపథ్యంలోనే సదరు పార్టీలను జాబితా నుంచి తొలగించేందుకు ఈసీ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం వద్ద సుమారు 2,800కు పైగా గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయి.సాధారణంగా, ఒక రాజకీయ పార్టీ ఎన్నికల సంఘం నుంచి అధికారిక గుర్తింపు పొందాలంటే, జరిగిన సాధారణ ఎన్నికల్లో పోలైన మొత్తం ఓట్లలో కనీసం ఆరు శాతం ఓట్లు సాధించాలి లేదా నిర్దిష్ట సంఖ్యలో అసెంబ్లీ లేదా లోక్‌సభ సీట్లను గెలుచుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రమాణాలను అందుకోలేని పార్టీలను కేవలం నమోదిత గుర్తింపు లేని పార్టీలుగానే పరిగణిస్తారు. ఇటువంటి పార్టీలు సుదీర్ఘకాలం పాటు ఎటువంటి ఎన్నికల కార్యకలాపాల్లో పాల్గొనకపోవడం, కనీసం పార్టీ కార్యాలయాలను కూడా నిర్వహించకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల సంఘం ఈ ప్రక్షాళన చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

## భారత్‌పై చైనా ఎత్తుగడ! బీజింగ్ నుంచి ఆగిపోయిన స్పెషాలిటీ ఫెర్టిలైజర్స్ సరఫరా

- మొదటి పేజీ తరువాయి

ఈ రకం ఎరువులను ఎగుమతి చేయాలంటే సంబంధిత ఫ్యాక్టరీల నుంచి వచ్చే షిప్‌మెంట్లను చైనా అధికారులు తనిఖీ చేయాల్సి ఉంటుంది. అయితే, భారత్‌కు రావాల్సిన షిప్‌మెంట్లను మాత్రం అధికారులు తనిఖీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలుస్తోంది. దీని ద్వారా, అధికారికంగా ఎలాంటి నిషేధం విధించకుండానే ఎగుమతులను అడ్డుకోవడానికి చైనా ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం.మొక్కలు, చెట్లకు భూమి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన పోషకాలను అందించి, అధిక ఫలసాయం సాధించడానికి ఈ ప్రత్యేక ఎరువులను ఉపయోగిస్తారు. వీటిలో అనేక రకాలు అందుబాటులో ఉన్నాయి. భారత్‌లో ఈ తరహా ఎరువులను పెద్ద మొత్తంలో తయారు చేసుకునే సామర్థ్యం ప్రస్తుతం పరిమితంగానే ఉంది. కొన్ని సంస్థలు చిన్న మొత్తాల్లో స్థానికంగా ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ఆర్థికంగా అవి అంత లాభదాయకంగా లేవు. మన దేశం వినియోగించే ప్రత్యేక ఎరువుల్లో దాదాపు 80 శాతం చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి.గత నాలుగైదేళ్లుగా చైనా ఈ సరఫరాలను నియంత్రిస్తూ వస్తోందని, ఈసారి మాత్రం పూర్తిగా నిలిపివేయడం ఆందోళనకరమని సోలబుల్ ఫర్టిలైజర్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజిబ్ చక్రబర్తి తెలిపారు. సాధారణంగా జూన్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో భారత్ సుమారు 1,50,000 నుంచి 1,60,000 టన్నుల ప్రత్యేక ఎరువులను దిగుమతి చేసుకుంటుందని గణాంకాలు చెబుతున్నాయి.భూసారాన్ని కాపాడుతూ, పంట దిగుబడిని పెంచడానికి రైతులు వీటిని ఎక్కువగా వినియోగిస్తారు. దేశీయంగా ఈ రంగంలో దీపక్ ఫర్టిలైజర్స్, ప్రదీప్ ఫర్టిలైజర్స్, నాగార్జున ఫర్టిలైజర్స్ వంటి కంపెనీలు ప్రధానంగా వ్యాపారం చేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ ఈ ఎరువుల కోసం పశ్చిమాసియా, ఐరోపా దేశాల్లోని ఉత్పత్తిదారుల వైపు చూడాల్సిన అవసరం ఏర్పడింది.గత ఐదేళ్లుగా భారత్–చైనా మధ్య నెలకొన్న దౌత్యపరమైన విభేదాలు, అలాగే పాకిస్థాన్‌తో చైనా సంబంధాలు బలపడటం వంటి అంశాలు ఈ పరిణామాలకు కారణంగా భావిస్తున్నారు. ఇప్పటికే చైనా రేర్ ఎర్త్ మాగ్నెటిక్స్ వంటి కీలక ముడిసరుకుల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. తాజా పరిణామం ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది.

## రాజమండ్రిలో 'అఖండ గోదావరి' పర్యాటక ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేసిన షెకావత్, పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

అఖండ గోదావరి ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులు వారికి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా పర్యాటకం గణనీయంగా వృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. వీరితో పాటు కూటమి ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, గిడ్డి సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, చిర్రి బాలరాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూడా హాజరయ్యారు.అలాగే, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ) ఛైర్మన్ తుమ్మల రామస్వామి, జిల్లా కలెక్టర్ తో పాటు ఇతర జిల్లా అధికారులు, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

## మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై కేసు.. ఎంపీపీ అరెస్ట్.. వైసీపీ నేతలకు చిక్కులు!

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తి తీవ్రంగా గాయపడి, ఒక కన్నును కోల్పోయారు. ఈ ఘటనపై బాధితులు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ను ఆశ్రయించారు.ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీసులు రంగంలోకి దిగి, బాధ్యులపై చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 19 మంది వైసీపీ నేతలపై కేసు నమోదు చేశారు. నిందితుల జాబితాలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, గడికోట రమేశ్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.ఈరోజు ఉదయం ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిని లక్కిరెడ్డిపల్లి ఇన్‌ఛార్జ్ సీఐ వరప్రసాద్ నేతృత్వంలోని పోలీసు బృందం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో మిగిలిన నిందితులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో జరిగిన ఈ సంఘటన, ఇప్పుడు వైసీపీ నేతలకు న్యాయపరమైన చిక్కులు తెచ్చిపెట్టింది.

## సీఎం చంద్రబాబును కలిసిన కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ స్పష్టం చేశారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆయన సమావేశమయ్యారు. సీఎం చంద్రబాబుతో ఏపీ అభివృద్ధి, కేంద్ర సహకారంపై చర్చించారు. అంతకుముందు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కేంద్ర మంత్రి షెకావత్‌కు స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి షెకావత్ ఇవాళ రాజమండ్రిలో అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని తెలిపారు. "అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రధాని మోదీ దార్శనికతతో దేశంలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల రూపకల్పనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు."డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. దేశంలోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా కూడా పర్యాటకుల రాక గణనీయంగా పెరిగింది, ముఖ్యంగా భారత్‌లో ఈ వృద్ధి వేగంగా ఉంది" అని షెకావత్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం ఉందని, రాష్ట్రం ఆధ్యాత్మికంగా కూడా పురోగమిస్తోందని ఆయన అన్నారు.రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం సుమారు రూ.450 కోట్లకు పైగా నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని షెకావత్ వెల్లడించారు. "స్వదేశీ దర్శన్, ప్రసాద్, సాక్షి, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ (సీబీడీడీ) వంటి వివిధ స్కీమ్‌ల ద్వారా కేంద్రం పర్యాటక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. స్వదేశీ దర్శన్ 2.0 కింద అరకు, బొర్రా గుహలు, లంబసింగి, సూర్యలంక బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నాం. ప్రసాద్ స్కీమ్ ద్వారా ఆధ్యాత్మిక టూరిజానికి బాటలు వేస్తున్నాం" అని తెలిపారు. అమరావతి, శ్రీశైలం దేవాలయాల్లో భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పనులు కొనసాగుతున్నాయని, అన్నవరం దేవాలయంలో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని ఆయన వివరించారు.

**అన్ని విధాలా కేంద్రం సహకారం: పురందేశ్వరి**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని తాము గతంలోనే చెప్పామని గుర్తుచేశారు. ప్రజలు తమపై నమ్మకంతో ఆశీర్వదించి గెలిపించారని ఆమె అన్నారు. "వికసిత్ భారత్‌లో వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఒక భాగం కావాలి. అమరావతి, పోలవరం వంటి అన్ని కీలక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది" అని పురందేశ్వరి తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి కేంద్రం సహాయం అందిస్తోందని, అనేక పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శంకుస్థాపనలు చేసుకుంటున్నామని ఆమె వివరించారు.

## డాకింగ్ విజయవంతం... అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

- మొదటి పేజీ తరువాయి

(ఐఎస్ఎస్) విజయవంతంగా అడుగుపెట్టారు. వారి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానమయ్యే (డాకింగ్) ప్రక్రియ గురువారం సాయంత్రం విజయవంతంగా పూర్తయింది. ఈ ఘనతతో అంతరిక్ష యాత్రల్లో భారత్ తనదైన ముద్రను మరోసారి చాటింది.

వివరాల్లోకి వెళితే, యాక్సియం–4 మిషన్‌లో భాగంగా భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలాండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ -విస్నీవ్స్కీ, హంగరీకి చెందిన టిబర్ కపులు అంతరిక్షయానం చేపట్టారు. భారత కాలమానం ప్రకారం బుధవారం (జూన్ 25) మధ్యాహ్నం 12:01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఫాల్కన్–9 రాకెట్ ద్వారా వీరి స్పేస్‌క్రాఫ్ట్ నింగిలోకి దూసుకెళ్లింది.

దాదాపు ఒక రోజు ప్రయాణం అనంతరం, గురువారం (జూన్ 26) సాయంత్రం ఈ వ్యోమగాముల బృందం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4:03 గంటలకు స్పేస్‌క్రాఫ్ట్‌ను ఐఎస్ఎస్‌తో అనుసంధానించే డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. అనంతరం వ్యోమగాములు నలుగురూ

ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. ఈ మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా సహా వ్యోమగాముల బృందం 14 రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడపనుంది. ఈ సమయంలో వారు పలు పరిశోధనలు, ప్రయోగాలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ విజయం భారత అంతరిక్ష పరిశోధనా కార్యక్రమాలకు మరింత ఊతమిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

పెన్ పవర్
ప్రకాశం




## 4 మండలాల తెలుగుదేశం పార్టీ

# అధ్యక్షుల ఎంపిక

పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు

తెలుగుదేశం పార్టీ బలం కార్యకర్తలే

పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఇంటూరి నాగేశ్వరావు ఆధ్వర్యంలో

పార్టీ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తాం

మండల పార్టీ నూతన అధ్యక్షులు

**కందుకూరు పెన్ పవర్, జూన్ 26**

కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు నియోజకవర్గం పరిశీలకులు కే కుసుమ కుమారి, రాష్ట్ర రైతు ఆర్గనైజేషన్ సెక్రటరీ రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, పామూరు మండలం మోపాడు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ చుంచు కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ వారందరికీ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు నాయకులే బలమని, గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేసే బాధ్యతను తాను తీసుకుంటానని ఎమ్మెల్యే పార్టీ నాయకులకు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని మొత్తం పదవులను కైవసం చేసుకునేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ కష్టపడాలని పార్టీ నేతలకు సూచించారు. నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు ఆయా మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పోయి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. ముందుగా పార్టీ అధ్యక్షుల ఎంపికలో భాగంగా, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులుగా పాలూరు - దొండపాడు గ్రామానికి చెందిన బుస్సారెడ్డి కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ప్రస్తుత గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావులను ఆయా మండలాల నేతలు, కార్యకర్తల అభిప్రాయాల మేరకు, తిరిగి వారిని అధ్యక్షులుగా కొనసాగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు కే కుసుమ కుమారి, రాష్ట్ర తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల శివప్రసాద్ రెడ్డి, పామూరు మండలం మోపాడు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ చుంచు కొండయ్య శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు నాయకత్వంలో కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, మండలంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు అందరినీ కలుపుకొని పోయి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులను గెలిపించుకుంటామని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి యువ నాయకులు నారా లోకేష్ కి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు కి పరిశీలకులు కే కుసుమ కుమారి కి, రాష్ట్ర తెలుగు ఆర్గనైజర్ సెక్రెటరీ రాచమల్లు శ్రీనివాసరెడ్డి కి పామూరు మండలం మోపాడు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ చుంచు కొండయ్య కి తమను మండల పార్టీ అధ్యక్షులుగా ఎన్నుకున్న మండల పార్టీ నాయకులకు కార్యకర్తలకు నలుగురు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దామ మల్లేశ్వరరావు, నార్నే రోశయ్య నాలుగు మండలాల గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ

# రూపకల్పనే లక్ష్యం

- మాదకద్రవ్యాలు లేని రాష్ట్రంగా ఏపీ
- డ్రగ్స్, గంజాయిని ఉక్కుపాదంతో అణిచివేస్తాం
- మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తాయి
- అన్నపూర్ణ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుదాం
- సరదాగా మొదలై వ్యసనంగా మారుతుంది.
- ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 26**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని కూటమి ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేస్తోందని, డ్రగ్స్ వల్ల ఆ కుటుంబమే కాదు సమాజంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని, మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒక ప్రకటన విడుదల చేశారు. నేడు యువత ఎక్కువగా డ్రగ్స్, గంజాయికి బానిసలు కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం సరదాగా మొదలై వ్యసనాంగా మారుతుందన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో అందరం భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం గంజాయి నిర్మూలనపై పటిష్ఠ చర్యలు ద్వారా గంజాయి ఆంధ్రప్రదేశ్ అనే మచ్చను తొలగించి, మళ్ళీ 'అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు కృషి ప్రారంభించిందన్నారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్యాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక మంత్రుల కమిటీ నిత్యం పరివేక్షిస్తోందని చెప్పారు. గంజాయి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేకంగా 'ఈగల్' విభాగాన్ని ఏర్పాటు చేసిందని,ఈ ఫోర్స్ గంజాయి సాగు, రవాణా, వినియోగం సహా ప్రతి దశలో నిఘా పెట్టి, నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి బయట నుండి వచ్చే స్మగ్లర్లను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించినట్టు చెప్పారు. డ్రోన్లు, శాటిలైట్లు, జీపీఎస్ ట్రాకింగ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఎయ్సైఐ ఆధారిత సీసీ టీవీలు వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులతో గంజాయి నియంత్రణకు ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. గత ప్రభుత్వంలో గంజాయి కేంద్రంగా పేరుగాంచిన అల్లూరి జిల్లాలో నేడు గంజాయి సాగు తగ్గిపోగా, మారుమూల గిరిజన గ్రామాల్లో గంజాయి సాగు పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. స్థానిక పోలీసులు, అధికారులు గిరిజనులను చైతన్యవంతుల్ని చేస్తూ గంజాయి నిర్మూలనలో కఠినంగా వ్యవహరిస్తున్నారన్నారు. గంజాయి సాగు, రవాణా, వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై గిరిజన రైతులు, స్థానిక ప్రజలు, విద్యార్థుల మధ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి జిల్లాలోనూ నార్కోటిక్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటయ్యాయని, ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులతో కలిసి 'పరివర్తన' పేరిట చర్చా సమావేశాలు నిర్వహిస్తూ, గంజాయి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని గంజాయిరహితం చేయడంలో భాగంగా స్మగ్లర్ల ఆస్తులను జప్తు చేయడంతో పాటు సాగుదారులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలను రద్దు చేయాలనే యోచనలో కూటమి ప్రభుత్వం ఉందని చెప్పారు. కఠిన చర్యలు విస్తృత నిఘా వల్ల గంజాయి సాగు గత సంవత్సరాలలో 11,000 ఎకరాల నుండి ప్రస్తుత సంవత్సరంలో 100 ఎకరాల కంటే తక్కువగా ఉందన్నారు.

**గంజాయిప్రదేశ్ గా మార్చిన జగన్ రెడ్డి పాలన....**

అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ గా ఉన్న రాష్ట్రాన్ని గత వైసీపీ పాలనలో గంజాయి ఆంధ్రప్రదేశ్ గా మార్చారని ఎమ్మెల్యే ఏలూరి ధ్వజమెత్తారు. గంజాయి సరఫరాకు ఆంధ్ర రాష్ట్రాన్ని దేశానికే రాజధానిగా వైసీపీ పాలకులు నిలిపారన్నారు. రాష్ట్రంలో మత్తు పదార్థాలకు బానిసలై గత ఐదేళ్ల పాలనలో 1,745 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు, కాలేజీలు, ట్యూషన్ బడ్డీలు ప్రదేశాలు మత్తు పదార్థాల కేంద్రాలుగా మారిపోయాయని ఆరోపించారు. విద్యాసంస్థల పరిధుల్లోనే గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు ఎన్నో వెలుగులోకి వచ్చాయన్నారు. తన పాలనలో రాష్ట్రాన్ని గంజాయి అడ్డగా మార్చి, యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడిన జగన్మోహన్ రెడ్డి, తెనాలిలో గంజాయి బానిసలుగా మారి పోలీసులపై దాడికి పాల్పడ్డ వారిని పరామర్శించి మరింత నీచమైన రాజకీయ సంస్కృతికి దారితీశాడని ఎమ్మెల్యే ఏలూరి మండిపడ్డారు.

# పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

## - జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్




**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 26**

అపరిష్కృతంగా ఉన్న లాంగ్ పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో జిల్లా ఎస్పీ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారీ నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ పోలీస్ స్టేషన్ల వారీగా గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల నమోదు, నిందితుల అరెస్టు, విచారణ, ఛార్జ్‌షీటు దాఖలు, పెండింగ్ కేసులు తదితర అంశాలపై పోలీస్ అధికారులను ఆరా తీశారు. నేర నియంత్రణ, నేరాల ఛేదించుట, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, శాంతి భద్రతల పరిరక్షణకు అధికారులకు పలు కీలక సూచనలు, మెళకువలను తెలియజేశారు. ఈ నేర సమీక్షా సమావేశంలో జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక కార్యచరణతో ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకుంటూ, ప్రతి ఒక్క పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పేలా కృషి చేయాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న కేసులలో సమగ్ర దర్యాప్తు చేసి, మహిళా సంబంధిత నేరాల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట సమయం లోపల బాధితులకు న్యాయం అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ల వారీగా యూఐ కేసులు తగ్గించుకోవాలని, వీలైనంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలని, అరెస్టులు, చార్జ్ షీట్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్ లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదృశ్యం కేసులలో ఏ విధమైన అలసత్వం చూపించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని, పోక్సో, రేప్ కేసులలో దర్యాప్తు వేగాన్ని పెంచాలని ఆదేశించారు. పాఠశాలలు, కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పిల్లలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి అవగాహన కలిగించాలని సూచించారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను పట్టుకోడానికి దొంగిలించబడిన సొత్తును రికవరీ చేయుటకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చెయ్యాలని, పాత నేరస్థులపై చెడునడతగల వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, విజిబుల్ పోలీసింగ్ చేస్తూ, నైట్ బీట్స్ బలోపేతం చేసి తనిఖీలు నిర్వహించాలన్నారు. చట్టవ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి కట్టడి చేయాలని తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రమాదాలు జరగకుండా సైన్ బోర్డ్స్, బారికేడ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాల కు సంబంధించిన ఎఫ్ఏఆర్, ఐఏఆర్ %ఇ% డీఏఆర్ రిపోర్ట్స్ ను నిర్ణీత కాలవ్యవధిలో ఎంఏసీటీ కోర్ట్ కు



పంపించాలని తెలిపారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని, మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలియజేశారు. రానున్న లోక్ అదాలత్ లో రాజీపడదగిన కేసులను లిస్ట్ అవుట్ చేసి, ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు కృషి చెయ్యాలన్నారు. పోలీస్ అధికారులు సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరిస్తూ, అంకితభావంతో విధులు నిర్వహించాలని, సమర్థవంతమైన సేవల ద్వారా జిల్లా పోలీస్‌శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. పోలీస్ సిబ్బంది నీట్ యూనిఫామ్ టర్న్ అవుట్ కలిగి ఉండాలన్నారు. ఈ నేర సమీక్ష సమావేశంలో డిఎస్పి లు లక్ష్మీనారాయణ, నాగరాజు, రమణ కుమార్, డిసిఆర్బి సిఐ దేవప్రభాకర్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, ఎస్సీ/ఎస్టీ సెల్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, సిఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## స్టేట్ ఆర్టీఐ వింగ్ జనరల్ సెక్రటరీగా కడప -వంశీధర్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 26**

స్టేట్ ఆర్టీఐ వింగ్ జనరల్ సెక్రటరీగా గిద్దలూరు నియోజకవర్గం కు చెందిన గిద్దలూరు మాజీ ఎమ్ పి.పి. ప్రస్తుత ఎంపిపి భర్త కడప. వంశీధర్ రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై ఎస్.జగన్మోహన్ రెడ్డి నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు . కడప వంశీని స్టేట్ ఆర్టీఐ జనరల్ సెక్రటరీగా నియమించినందుకు పలువురు వైకాపా నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రశంశల జల్లులు కురిపించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనపై నమ్మకముంచి స్టేట్ ఆర్టీఐ జనరల్ సెక్రటరీగా నియమించి నందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన భాద్యతలను అత్యంత భాధ్యతాయుతంగా నిర్వహిస్తామని తెలిపారు.

## ఎమ్మెల్యే ముత్తుములను మర్యాద పూర్వకంగా కలిసిన మున్సిపల్ కమిషనర్ రమణ బాబు



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 26**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు , శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ని గిద్దలూరు మున్సిపాలిటీకి నూతన కమిషనర్ గా నియమితులైన ఈవీ రమణ గురువారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ,అందజేసి దుశ్శాలువా తో సత్కరించారు ఈ సందర్భంగా గిద్దలూరు పట్టణంలో అభివృద్ధి, పరిశుభ్రత, పై దృష్టి సారించాలని ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన తక్షణమే స్పందించాలని, త్రాగునీటి సమస్య ప్రాంతాలను గుర్తించి త్రాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కమీషనర్ కు సూచించారు.

## ఎమ్మెల్యే ముత్తుముల ను మర్యాదపూర్వకంగా కలసిన డి.యల్.డి.ఓ.



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 26**

గిద్దలూరు పట్టణంలోని ప్రశాంత్ నగర్ లోని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ని వారి గృహంలో డివిజనల్ లెవెల్ డెవలప్ మెంట్ అధికారి డి. బాలు నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా శాసనసభ్యులు అశోక్ రెడ్డి డివిజనల్ లెవెల్ డెవలప్ మెంట్ అధికారి తో మాట్లాడుతూ గిద్దలూరు నియోజక వర్గంలో ఉన్న సర్వే ల గురించి ఆరా తీశారు, వారు ఇచ్చిన సమాధానాలతో శాసనసభ్యులు అశోక్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రతిభ విద్యార్థినికి లాల్ ఫౌండేషన్ నగదు బహుమతి

**పొదిలి, పెన్ పవర్, జూన్ 26**

స్థానిక వివేకానంద జూనియర్ కళాశాల లో విద్యను అభ్యసిస్తూ, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థిని ఎస్ తాహెరా ను లాల్ ఫౌండేషన్ నగదు బహుమతి అందజేసింది గురువారం నాడు పొదిలిలోని వివేకానంద కళాశాలలో లాల్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థిని తాహెరా కు 5000 రూపాయలు నగదు బహుమతి అందజేసి ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడి హరిబాబు, లాల్ ఫౌండేషన్ అధినేత అలీ హజీర్, వివేకానంద విద్యాసంస్థల డైరెక్టర్ వై వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ బోనం శ్రీనివాసరెడ్డి, కుమార్, లాల్ ఫౌండేషన్ ప్రతినిధి షర్మిల, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికీ పరిశుభ్రతపై అవగాహన

# చెత్తను వేరు వేరుగా ఇవ్వండి: గిద్దలూరు కమిషనర్







**గిద్దలూరు, పెన్ పవర్, జూన్ 26:**

గిద్దలూరు పురపాలక సంఘ కమిషనర్ ఈవి రమణ బాబు గురువారం ఉదయం కొంగలవీడు రోడ్డులో పర్యటించారు. ఆ ప్రాంతంలోని ఇళ్ల వద్ద ఆగుతూ, ప్రజలతో మట్లాడారు. ముఖ్యంగా గృహిణులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఇంట్లో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపాలిటీకి అందించాలని ఆయన సూచించారు. తడి చెత్తను ముండ్లపాడు రోడ్డులో ఉన్న ప్రాసెసింగ్ ప్లాంట్లో విండ్రో కంపోస్టింగ్ ద్వారా ఎరువుగా మార్చనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా హోమ్ కంపోస్టింగ్ విధానాన్ని అనుసరిస్తే ఇంటి తోటల్లో, టెర్రస్ గార్డెనింగ్లో అవసరమైన ఆకుకూరలు, కూరగాయలను రసాయన ఎరువులు లేకుండానే పండించుకోవచ్చని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటర్ బాటిల్స్, క్యారీ బ్యాగ్స్, కొబ్బరి బొండాలు వంటి చెత్తను కాలువల్లో వేయకూడదని స్పష్టం చేశారు. ఇవి మురుగు కాలువల్లో నిలిచిపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయని చెప్పారు. ఇంట్లో ఏర్పడే చెత్తను మున్సిపాలిటీ కార్మికులకు అప్పగించాలని సూచించారు. గిద్దలూరును సుందరమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని రమణబాబు అన్నారు. వార్డులో సమస్యలు ఉంటే సమాచారం ఇవ్వాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో గిద్దలూరును "ఆరోగ్య గిద్దలూరు"గా మార్చాలన్నదే లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్తో పాటు ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ సాయి, శానిటరీ సెక్రటరీ బీ. సునీత, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం జారీ పై శిక్షణ





**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 26**

గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ ఎమ్ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో లో కౌలు రైతులకు"పంట సాగు హక్కు పత్రం" జారీ పై మండలం లోని గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 2025-26 వ సంవత్సరానికి గిద్దలూరు మండలానికి 1534 కౌలు కార్డులు టార్గెట్ ఇవ్వడం జరిగిందని, ఇప్పటి వరకు 400 కార్డులు మాత్రమే జారీ చేయడం జరిగిందన్నారు,ఈ కార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమే అని తెలియజేస్తూ దీని వలన భూ యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, కౌలు రైతులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుంది గాని భూమి మీద ఎటువంటి హక్కు ఉండదని తెలిపారు. దేవాదాయ భూములకు కౌలు కార్డ్స్ ఇవ్వవచ్చని,అసైన్మెంట్ పొలాలకు కౌలు కార్డ్స్ ఇవ్వకూడదని తెలిపారు. ఒకే కుటుంబం లోని భార్య భర్త లకు, తండ్రి కొడుకులకు కూడా కౌలు కార్డులు ఇవ్వకూడదన్నారు. ప్రభుత్వం నిర్ణంచిన తేదీ లోపు కౌలు రైతులకు కార్డ్స్ ఇచ్చి వారికి ప్రభుత్వం నుండి వచ్చే అన్ని ప్రయోజనాలు పొందే విదంగా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ భూ యజమానులతోపాటు కౌలు రైతులు కూడా ప్రభుత్వం ద్వారా అందే ప్రతి ఒక్క పథకం లో అరులు కావాలనే ఉద్దేశ్యం తో పంట సాగుదారు హక్కు చట్టం తీసుకురావడం జరిగిందన్నారు . కౌలు రైతులకు కూడా భూ యజమానులతో సమానంగా పంట నమోదు, అన్నదాత సుఖీభవ,పంటల భీమా, పంట నష్ట పరిహారం, కౌలు రుణాలు, ధాన్యం కొనుగోలు, సబ్సిడీ పై విత్తనాలు పంపిణీ మొదలైన పథకాలు పొందవచ్చని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రతి ఒక్క రైతు సేవా కేంద్ర సిబ్బంది కౌలు రైతులను గుర్తించి వారికి అవగాహన కల్పించి సంబంధిత పత్రాలు తీసుకొని గ్రామ రెవిన్యూ అధికారి ని సంప్రదించి కౌలు పత్రాలు పొందే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భాస్కరరావు, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్ రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు, , రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి

**డి. యల్.డి. ఓ., డి. బాలు నాయక్**





**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 26**

సర్వే లు సకాలంలో పూర్తి చేయాలని డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ అధికారి డి. బాలు నాయక్ కొరసరు గురువారం మండల పరిషత్ కార్యాలయము లో గ్రామ సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు, ముఖ్యంగా తల్లికి వందనం ద్వారా ఎవరికైతే తల్లులకు ఇకేవైసి లేకుండా ఉంటుందో వారికి వెంటనే ఇకేవైసి చేయించాలని ఆదేశించారు, చిల్డ్రన్ ఆధార్ కార్డు ఇలాంటి సర్వేలన్ని పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమణా రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు వ్యాధులు సోకాక

# ముందే ముందస్తు టీకాలు వేయించుకోవాలి

**జిల్లా పశువర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రవి**







**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 26**

పశుపోషకులు తమ పశువులకు వ్యాధులు సోకకముందే ముందస్తు టీకాలు వేయించుకోవాలని జిల్లా పశువర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రవి తెలిపారు మండలంలోని చెన్నపనాయునిపల్లి గ్రామంలో గురువారం గొర్రెలు మేకలలో సామాజిక నట్టల నివారణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వులల్లో నట్టల ప్రభావం నివారించేందుకు మరియు అన్ని రకాల వ్యాధులకు పశు వైద్యశాలలో మందులు అందుబాటులో ఉన్నాయని పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ నట్టల నివారణ కార్యక్రమం 26వ తేదీ నుండి వచ్చేనెల 10వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు మండలంలోని మారుమూల గ్రామాలైన చెన్నపనాయునిపల్లి వి బైలు గ్రామాలకు వారంలో ఒకసారి సంచార పశు వైద్యశాల సిబ్బంది అందుబాటులో ఉంచుతామని తెలిపారు అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయని పోషకులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు జీవాల్లో వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు ఈ కార్యక్రమంలో గొర్రెల సహకార సంఘం జిల్లా అధ్యక్షులు తోడేటి గోపి, సిఎస్పురం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్ రమేష్, గొర్రెల సహకార సంఘం జిల్లా కార్యదర్శి ఎం రామకృష్ణ, సర్పంచ్ యనమల పెద్ద సుబ్బయ్య , మాజీ సర్పంచ్ చిట్టిబోయిన వెంకటేశ్వర్లు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ షేక్ మునీర్ పశువైద్య సిబ్బంది పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

## పుల్లలచెరువు మండలంలో జేసీ పర్యటన

**నరజాముల తండాలో విచారణ.**





**పుల్లలచెరువు పెన్ పవర్ జూన్ 26**

జిల్లా సంయుక్త కలెక్టర్ రోనంకి. గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డివిజనల్ ఫారెస్ట్ అధికారి సందీప్ కుమార్ , తాహసిల్దార్ కే వెంకటేశ్వరావు పుల్లలచెరువు మండలంలోని నరజాముల తాండ గ్రామంలో గ్రామస్తులు ఇంటి నివేశన స్థలములు మరియు బోర్లు మంజూరు కోసం చేసుకున్న దరఖాస్తులపై సంయుక్త విచారణ నిమిత్తం జేసీ పర్యటించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. నరజాముల తాండలో రెవిన్యూ ల్యాండ్స్, ఫారెస్ట్ ల్యాండ్స్ ఏవనే విషయమై విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలను,మరియు ఇంటి నివేశన స్థలాలను పరిశీలించారు. విచారణలో తహసిల్దార్ కే వెంకటేశ్వరరావు, వి ఆర్ ఓ లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమయిన శ్రీ వారాహీ నవరాత్రుల వేడుకలు







**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జూన్ 26**
కనిగిరి కేటీఆర్ టెక్నో స్కూల్ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, సరస్వతీ అమ్మవారి దేవాలయంలో గురువారం నుంచి శ్రీవారాహీ (గుప్త) నవరాత్రుల వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా శ్రీ చండీ యాగ సహిత వారాహీ హోమం నిర్వహించారు. తొలుత గణపతి పూజ, స్వస్తి వాచనము, మత్రుకాపూజనము, దీక్షధారణ,కలిశస్థాపన, అభిషేకం, అర్చన హోమాలును వేదపండితులు రావినూతల రమేష్ శర్మ బ్రహ్మంత్వమున వైభవంగా నిర్వహించారు. చండీ హోమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు కుందురు తిరుపతి రెడ్డి, కార్యదర్శి కొప్పరపు సత్యాలు దంపతులు పూజలు, గోపూజ నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులుకు ప్రసాదాలు అందించారు. వారాహీ నవరాత్రుల వేడుకలులో దేవస్థానం కమిటీ కోశాధికారి ఉప్పాల నరశింహరావు, సభ్యులు సింగరాజు మాలకొండేశ్వరరావు, మారెళ్ళ ఉమాకాంత్, ఉప్పాల సుబ్బారావు, దేవస్థానం ప్రధాన అర్చకులు చోడా వీరభద్రస్వామి, రఘురామిరెడ్డి , వెంకటప్ప రెడ్డి, గోనుగుంట్ల మల్లికార్జున, రాచర్ల నరేష్, సూరే పెద వేంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

## పేదరాలి అంత్యక్రియలకు ఆదుకున్న మానవత స్వచ్ఛంద సంస్థ



**పొదిలి, పెన్ పవర్, జూన్ 26**
ఒక పేద ర్యాలీ అంత్యక్రియలకు మానవతా స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది పొదిలి పట్టణంలో నీ ఇస్లాంపేటలో నివసిస్తున్న యు రమణమ్మ అనే వృద్ధురాలు గురువారం నాడు అనారోగ్యంతో మరణించింది అయితే మృతురాలి కుమార్తె తన తల్లి అంత్యక్రియలను కూడా చేసేందుకు ఆర్థిక స్తోమత లేని విషయాన్ని మానవత స్వచ్ఛంద సంస్థ మీడియా ప్రతినిధి షేక్ బాజీ కరీముల్లా దృష్టికి వెళ్ళింది దీంతో స్పందించిన మానవతా స్వచ్ఛంద సంస్థ కమిటీ సభ్యులు మృతురాలు రవణమ్మ కుమార్తెకు అంత్యక్రియల నిమిత్తం ఐదు వేల రూపాయల నగదు సాయాన్ని అందజేశారు అలాగే మృతురాలు రవణమ్మ అంతక్రియల నిమిత్తం ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన సహాయ కార్యక్రమాలను కూడా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు బండి అశోక్, కరీముల్లా బేగ్, ఆర్ఎంపి వైద్యులు భాస్కర్, స్వచ్ఛంద సంస్థ మీడియా ప్రతినిధి బాజీ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పథకాలు

### కౌలు రైతులకు అందేలా చూడాలి



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెనపవర్ జూన్ 26**
కౌలు కార్డు అర్హతకలిగిన రైతులను గుర్తించి, వారికి కౌలు కార్డు పొందేలా ప్రోత్సహించాలని, వ్యవసాయ సంక్షేమ పథకాలలలో వారు లబ్ది పొందేలా చూడాలని తహసీల్దార్ డి, మంజునాథ రెడ్డి అన్నారు. మండలంలోని తహసిల్దార్ కార్యాలయం లో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ గ్రామస్థాయి సిబ్బందులకు కౌలు రైతు పంట సాగుదారుల హక్కు పత్రం గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.తహసిల్దార్ డి. మంజునాథ రెడ్డి,మండల వ్యవసాయ అధికారి కె. నీరజలు మాట్లాడుతూ సి సి ఆర్ సి కోసం ముందుగా గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ప్రజలకు తెలియపరచాలి అన్నారు. కౌలు చేసే రైతులు యజమాని యొక్క పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో పాటుగా కౌలు రైతు కూడా తన ఆధార్ కార్డు, పాస్ సైజు ఫోటో ఫారంఀ1 కి జత చేసి దానితో పాటు భూయజమానికి కౌలు రైతుదారునకు ఒప్పందంగా, పది రూపాయల స్టాంప్ మీద పరస్పర ఒప్పందము కుదుర్చుకున్నట్లుగా వ్రాసుకున్న అంగీకార పత్రాన్ని కూడా జతచేసి గ్రామ రెవెన్యూ అధికారి గారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.గ్రామ రెవెన్యూ అధికారులు కౌలు రైతు ఇచ్చిన ఫారం వివరాలను పరిశీలించి సి సి ఆర్ సి కార్డు మంజూరు చేయడం జరుగుతుందని,తద్వారా ప్రభుత్వం ద్వారా అమలవుతున్న అనేక వ్యవసాయ సంక్షేమ పథకాలు కౌలు రైతులకు కూడా వర్తిస్తుందని వివరించారు. కావున గ్రామ వ్యవసాయ,రెవెన్యూ సిబ్బంది వారి పరిధిలో గల కౌలు రైతులను గుర్తించి అవగాహన కల్పించాలని, మండలంలో 1238 కౌలు రైతు కార్డులు చేయాలని లక్ష్యం నిర్దేశించబడినట్లు తెలిపారు. ఏ ఈ ఒ టీ పొట్టయ్య, డి.ధనేశ్వర్ నాయక్ , గ్రామ రెవెన్యూ అధికారులు,గ్రామ వ్యవసాయ ఉద్యానవన సహాయకులు పాల్గొనడం జరిగినది.

## అల్లినగరం హై స్కూల్ విద్యార్థులకు యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యా సామాగ్రి పంపిణీ

**అల్లినగరం హై స్కూల్ లో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య.**
**సొంత నిధులతో విద్యాసామగ్రి కొనుగోలు చేసి ప్రధానోపాధ్యాయురాలు పద్మజ కు చేసిన మొర్రి పిచ్చయ్య.**
**దాత మొర్రి పిచ్చయ్యను అభినందించిన ప్రధానోపాధ్యాయురాలు పద్మజ.**



**కొమరోలు పెన్ పవర్ జూన్ 26**
కొమరోలు మండలం అల్లినగరంలో గల మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ స్కూల్లో చదువుతున్న 100 మంది విద్యార్థులకు హిందీ కాపీ రైటింగ్ తదితర విద్యాసామాగ్రిని అదే పాఠశాలలో హిందీ పండిట్ గా పనిచేస్తున్న రాష్ట్ర ఉత్తమ హిందీ పండిట్ అవార్డు గ్రహీత యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య సహకారంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ గురువారం పంపిణీ చేశారు. గిద్దలూరు మండలం పొదలకుంటపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో హిందీ పండుగ పనిచేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యను గత నెలలో ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీలలో భాగంగా అల్లినగరంలోని మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్ కు బదిలీ చేశారు. పిచ్చయ్య తన సబ్జెక్టు అయిన హిందీ భాషను బోధించడమే కాకుండా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ సహకారంతో విద్యార్థులలో సామాజిక స్పృహ, దేశభక్తి, క్రమశిక్షణ, తల్లిదండ్రులు గురువుల పట్ల చూపించవలసిన గౌరవ మర్యాదలను విద్యార్థులకు వివరిస్తూ వారిని తీర్చి దిద్దుతున్నారు .కాగా ఆ పాఠశాలలో చదువుతున్న వందమంది నిరుపేద విద్యార్థులకు సౌకర్యార్థం పిచ్చయ్య తన సొంత నిధులతో హిందీ కాపీ రైటింగ్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేసర్లు, మెండర్లు తదితర విద్యాసామాగ్రిని కొనుగోలు చేసి ప్రధానోపాధ్యాయురాలు పద్మజకు అందజేశారు. వాటిని గురువారం ఆ పాఠశాలలు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మజ విద్యార్థులకు పంపిణీ చేసి విద్యాసామాగ్రిని సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమ విద్యార్థులు అభివృద్ధి చెందాలని కోరారు. డాక్టర్ మొర్రి పిచ్చయ్య హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తూనే పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల అభివృద్ధికి సహకరిస్తున్నారని అంటూ దాత మొర్రి పిచ్చయ్యను ఆమె అభినందించారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పై ప్రత్యేక శిక్షణ తరగతులను హరికుమార్ చౌదరి నిర్వహిస్తున్నారని అంటూ హరికుమార్ చౌదరిని అభినందించారు . ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు జనార్దన్ రాజు ,చంద్రమోహన్, శివరాం, ఆదిలక్ష్మి, శ్రీనివాసులు,,కృష్ణమూర్తి, బోధనేతర సిబ్బంది ఫకీరయ్య, అశ్వినీ దేవి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ అన్సారియా సేవలు అభినందనీయం

### - ఏపిఎన్‌ఎన్ జి ఓ నేతలు



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 26**
జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజానీకానికి నిత్యం సేవ చేయాలని పరితపించే జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సేవలు అభినందనీయం అని ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కె శరత్ బాబు పేర్కొన్నారు. గురువారం ప్రకాశం జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియా ప్రకాశం జిల్లా కలెక్టర్ గా ఒక సంవత్సర కాలం పూర్తి చేసుకొన్న సందర్భంగా ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కె శరత్ బాబు, కార్యదర్శి ఆర్ సి హెచ్ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గం కలసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కె. శరత్ బాబు మాట్లాడుతూ బంగారు బాల్యం కార్యక్రమానికి జాతీయ స్థాయి స్కాచ్ అవార్డ్ సాధించి జిల్లాను ప్రథమ స్థానం లో నిలిపారని భవిష్యత్ లో కూడా జిల్లాను అభివృద్ధి పథంలో కలెక్టర్ నడిపిస్తారని ఆకాంక్షించారు. జిల్లా కార్యదర్శి ఆర్ సి హెచ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఒంగోలు పట్టణ అధ్యక్షులు కొత్తపల్లి మంజేశ్, ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పి రామాంజనేయులు, సంయుక్త కార్యదర్శి షేక్ మోమిన్, రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ పి.మాధవి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కె కోటేశ్వరమ్మ ఒంగోలు పట్టణ ఉపాధ్యక్షులు షేక్ కరీముల్లా, వి హరిబాబు, వివిధ డిపార్ట్మెంట్ల ఉద్యోగులు పాల్గొని జిల్లా కలెక్టర్ కి అభినందనలు తెలియజేశారు.

## విద్యుత్ సరఫరా నిలుపుదల వేళలలో మార్పు చేయాలి.

**ఉదయం ఏడు గంటల నుంచి సరఫరా నిలిపివేయడంతో ఇబ్బందులు పడ్డ గృహిణులు విద్యార్థులు ఉద్యోగస్తులు.**



**కొమరోలు పెన్ పవర్ జూన్ 26.**
కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో భాగంగా కొమరోలు మండలంలో విద్యుత్ అధికారులు ఉదయం 7 గంటల నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నందువల్ల తాము తీవ్ర అసౌకర్యానికి ఇబ్బందులకు గురవుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. ఆర్ డి ఎస్ ఎస్ పథకంలో భాగంగా కొమరోలు మండలంలో గత కొంతకాలంగా దశలవారీగా కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నారు.అందులో భాగంగా కొత్త లైన్లు ఏర్పాటు చేసే గ్రామాలలో కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అయితే మొన్నటి వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తూ వచ్చారు కాగా గురువారం కొమరోలు, సురవారిపల్లె, చింతలపల్లె తదితర గ్రామపంచాయతీల పరిధిలో కొత్త లైన్లు ఏర్పాటు చేయుటకు వీలుగా ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేనున్నట్లుగా అధికారులు ముందస్తుగా పత్రికలకు ప్రకటనలు జారీ చేశారు ఆ మేరకు గురువారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది దీనితో ఇళ్లలోని కుక్కర్లు మిక్సీలుాటర్ హీటర్లు గీజర్లు తదితర విద్యుత్ ఉపకరణాలు పనిచేయక పోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగస్తులను సిద్ధం చేసి పంపేందుకు గృహిణులు పలు ఇబ్బందులు పడ్డారు. అంతేకాక నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని గురయ్యారు. కావున విద్యుత్ నిలిపిదల చేసే సమయాలను మార్పు చేస్తూ ఉదయం 7 గంటల నుంచి కాకుండా 9 గంటల తర్వాత నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తా - మేయర్ గంగాడ సుజాత





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 26**
అదనపు తరగతి గదుల కొరత ఉందని శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు సహకారంతో ఫండ్స్ మంజూరు చేయించే విధంగా చర్యలు తీసుకొని అదనపు తరగతి గదులను ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గురువారం ఒంగోలు నగరం 18 వ డివిజన్ వెంగముక్కలపాలెం నందు గల జడ్పీ ఎలిమెంటరీ స్కూల్ ను మేయర్ గంగాడ సుజాత విద్యాశాఖ అధికారులతో సంప్రదించి ఎలిమెంటరీ స్కూలును హై స్కూల్ గా అప్ గ్రేడ్ చేయించి డివిజన్లో ఉన్న 8 %ఇ% 9 తరగతి చదువుతున్న పిల్లలకు డివిజన్లోనే చదువుకునే అవకాశాన్ని కల్పించారు. జడ్పీ హైస్కూల్ నందు మేయర్ విద్యాశాఖ అధికారులతో కలిసి తనిఖీ నిర్వహించారు, స్కూల్ నందు గల తరగతి గదులను పరిశీలించి పిల్లలకు అందుతున్న సౌకర్యం గురించి తెలుసుకున్నారు. అనంతరం మేయర్ పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు ఎంఈఓ కిషోర్, టిడిపి, జనసేన నాయకులు, స్కూల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## జులై 9వ తేదీన జరుగు దేశ వ్యాప్తి సమ్మెను జయప్రదం చేయండి.

**ఆశా వర్కర్స్ యూనియన్**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధనలక్ష్మి.**



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 26**
ఆశ వర్కర్స్ యూనియన్ గిద్దలూరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం గురువారం విట్ట సుబ్బరత్నం కళ్యాణ మండపంలో జి విశ్రాంతమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ జులై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో జిల్లాలో ఉన్న ఆశా వర్కర్స్ అందరు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలన్నారు . కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను అందులో 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడంతో కార్మికుల హక్కులను హరించి పెట్టుబడిదారులకు బానిసలుగా చేసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు . కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్ల అందరిని కార్మికులు గా గుర్తించాలని, ప్రతి ఒక్కరికి కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుటమీ ప్రభుత్వం ఎన్నికల అప్పుడు స్కీం వర్కర్లకు అనేక హామీలు ఇచ్చిందని ఆ హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన వివిధ ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రాబోయే రోజులలో ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న వివిధ కార్మికులు, ఉద్యోగులు అందరూ కలిసి ఐక్య పోరాటాలు చేయడంతో సమస్యలు పరిష్కారమైతాయాన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఐ రాఘవమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు గత ప్రభుత్వం హయాంలో పోరాటం చేయగా అప్పటి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకొన్నప్పటికి ఇప్పటికీ ఆ ఒప్పందాలకు ప్రభుత్వం జీవోలు ఇవ్వలేదన్నారు . ఆశా వర్కర్లపై పని భారం పెరిగిందని అధికారుల ఒత్తిడి పెరిగిందన్నారు. ఆశా వర్కర్స్ కి పని భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని అధికారులను ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి ఆవులయ్య ఎస్కే అన్వర్ డి తామస్ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నూర్జహాన్, సరోజ, వి సంతోషి, జైనాబి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ద్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు

## గుద్లూరు పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ -బస్టాండ్ సెంటరులో మానవహారం, ప్రతిజ్ఞ నిర్వహణ








**గుద్లూరు, పెన్ పవర్, జూన్ 26:**

డ్రగ్స్ కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు అని గుద్లూరు సర్కిల్ సీఐ మంగారావు అన్నారు. మండల కేంద్రమైన గుద్లూరులో పోలీసుల ఆధ్వర్యంలో గురువారం డ్రగ్స్ కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు, అధికారులు పాల్గొని నినాదాలతో మత్తు వ్యసనానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి, సందేశాత్మక కార్యక్రమం నిర్వహించారు. ఎస్.ఐ వి.వెంకట్రావు మాట్లాడుతూ ప్రజలు, విద్యార్థులు, యువత యాంటీ డ్రగ్స్ కి పూర్తిగా సహకరించాలని, యాంటీ డ్రగ్స్ ప్రోగ్రామును గ్రామస్థాయికి తీసుకెళ్లాలని ఎస్ఐ పేర్కొన్నారు. డ్రగ్స్ పై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్సై చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉంటూ, ప్రత్యేక నిఘా కలిగి ఉండాలన్నారు. సీఐ మంగారావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక,మానసిక,సామాజిక రుగ్మతల గురించి వివరించారు. మత్తు పదార్థాల మత్తు గంటల పాటు ఉండొచ్చు కానీ ఈ సమయంలో యువత ఆలోచన చేసే స్థితిలో ఉండరని, దీనివలన హత్యలు, లైంగిక దాడులు, దొంగతనాలు వంటి నేరాలకు దారి తీస్తోందన్నారు. అంతేగాక గ్రామీణ ఆర్థిక స్థితిని కూడా ప్రభావితం చేస్తోంది అని చెప్పారు. కాబట్టి డ్రగ్స్ మత్తులో పడి మీ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ, ఎస్సై తో పాటు పోలీస్ సిబ్బంది, హైస్కూల్ ఉపాధ్యాయులు మురళి, వ్యాయామ ఉపాధ్యాయులు గంజి మాల్యాద్రి , విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# పక్కా గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

**ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు అదనంగా 50,000 మంజూరు.**

**హౌసింగ్ ఈఈ పి వెంకట్రావు.**



**కొమరోలు పెన్ పవర్ జూన్ 26**

ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాలను స్వరతగతిన పూర్తి చేసుకొని సొంతింటి కలను సహకారం చేసుకోవటమే కాక ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని మార్కాపురం హౌసింగ్ ఈఈ వెంకట్రావు తెలిపారు. గురువారం ఆయన గిద్దలూరు హౌసింగ్ డిఈ ఈ షేక్ ఖదీర్ భాష ,కొమరోలు హౌసింగ్ ఏఈ జి కృష్ణారెడ్డి లతో కలిసి కొమరోలు మండలం లోని పలు గ్రామాలలో గల అవుట్లను సందర్శించి పరిశీలించారు. ఆ సందర్భంగా ఈ ఈ వెంకట్రావు తాటిచెర లేఔట్ లబ్ధిదారులతో మాట్లాడుతూ లబ్ధిదారులు పక్కా ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ,అలాంటి వారికి 50 వేల రూపాయలు అదనంగా మంజూరు చేస్తామని తెలిపారు. లబ్ధిదారులకు అవసరమైన సిమెంటు ,ఐరన్, ఇసుక తదితర మెటీరియల్ను సకాలంలో పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆ సందర్భంగా లబ్ధిదారులకు అడిషనల్ ఫైనాన్స్ అమౌంట్ పై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు . కావున లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకొని తమకు మంజూరైన పక్కా గృహాలను పూర్తి చేసుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఆయన కోరారు. ఆ కార్యక్రమంలో గిద్దలూరు హౌసింగ్ డిఈ ఈ ఖదీర్ భాష , కొమరోలు ఏఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో నూరు శాతం నమోదు సాధించాలి

**ఎంఈఓ రాజాల కొండారెడ్డి**






**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 26**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి రాజాల కొండారెడ్డి అన్నారు గురువారం ఆయన సిఎస్పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు కెజిబివి విద్యాలయాలను సందర్శించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల తల్లిదండ్రుల కమిటీలు సహకారం తీసుకొని నూరు శాతం విద్యార్థులు బడిలోనే ఉండేలా చూడాలన్నారు జూన్ 12వ తేదీ నుంచి జూలై 12 వరకు నెల రోజులపాటు ప్రభుత్వము ప్రత్యేక ఎన్రోల్ మెంట్ డ్రైవ్ నిర్వహిస్తుందన్నారు ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో మండల తహశీల్దార్, మండల అభివృద్ధి అధికారి, ఎం ఈ ఓ లతోపాటు మండల ప్రత్యేక అధికారులు సచివాలయ సిబ్బంది సిఆర్పిలు ఐఈఆర్పి లు పాల్గొంటున్నారని తెలిపారు జులై 5వ తేదీన అన్ని పాఠశాలలో మెగా తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు నూరు శాతం విద్యార్థులు బడిలో నమోదుయ్యేలా కృషి చేయాలని సూచించారు మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచాల్సి ఉందని తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నందున గుణాత్మక విద్య అందుతుందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీషాబేగం, కేజీబీవీ ప్రిన్సిపాల్ షేక్ రేష్మ , సిఆర్పి సతీష్ కుమార్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# సబ్సిడీ రుణాల రికవరీకి చర్యలు

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 26**

ప్రకాశం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు అయిన వివిధ పథకాలకు సంబంధించిన లబ్దిదారులు వెంటనే రుణ బకాయిలు మొత్తం చెల్లించి రుణ విముక్తి పత్రం పొందాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ఒక ప్రకటన లో తెలియజేశారు. సబ్సిడీ, బ్యాంకు రుణాలు జాతీయ షెడ్యూల్ కులముల ఆర్థిక , అభివృద్ధి కార్పొరేషన్ ( ఎన్ఎస్ఎఫ్డీసీ ), జాతీయ సఫాయికర్మచారీల ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎస్కేఎఫ్డీసి) ప్రకాశం జిల్లాలోని షెడ్యూల్ కులముల కార్పొరేషన్ ఒంగోలు వారి ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కావున లబ్దిదారులుకు ప్రభుత్వం వారు విధించిన గడువు కాలం 60 నెలలు పూర్తి అయినందున కావున లబ్దిదారులు వెంటనే రుణ బకాయిలు మొత్తం చెల్లించాలని తెలిపారు.

# కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

## మండల తహశీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 26**

కౌలుకు భూమి తీసుకొని సాగు చేసేటటువంటి ప్రతి రైతు తప్పనిసరిగా గ్రామ రెవిన్యూ అధికారి దగ్గర కౌలు గుర్తింపుకార్డు కొరకు దరఖాస్తు చేసుకొని కౌలు కార్డు తీసుకోవాలని మండల తహశీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. చంద్రశేఖరపురం మండలంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో పంట సాగుదారు హక్కు పత్రం ( కౌలు కార్డులు ) పై గ్రామ రెవిన్యూ అధికారులకు మరియు గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు మండల తహశీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ సంవత్సరము చంద్రశేఖరపురం మండలానికి 1012 మంది కౌలు రైతులకు సిసిఆర్సి కార్డ్స్ జారీ చేయవలెనని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారని, గ్రామ రెవెన్యూ అధికారులు మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామంలోని కౌలు రైతులకు మరియు భూ యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు , ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. మధుబాబు మాట్లాడుతూ కౌలుకు పొలం తీసుకొని సాగు చేసేటటువంటి రైతులు కౌలు కార్డు తీసుకోవడం వలన కలుగు ప్రయోజనాలను గురించి రైతులకు తెలియజేయాలని సూచించారు, పంట రుణము, ప్రభుత్వం వారు అందించే పంటల బీమా, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ శాఖ నుండి వచ్చేటటువంటి రాయితీలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టముకు గల రాయితీలు పొందుటకు తప్పనిసరిగా కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం ఉండవలెనని, పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వడం వలన భూమి యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, కౌలు రైతులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని తెలిపారు. దేవాదాయ భూములకు కూడా పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వవచ్చునని మండలంలోని కౌలుకు సాగు చేసేటటువంటి రైతులందరూ మీ గ్రామ రెవిన్యూ అధికారి లేదా రైతు సేవా కేంద్రం లోని గ్రామ వ్యవసాయమరియు ఉద్యాన సహాయకులు సంప్రదించి పంట సాగు హక్కు పత్రం తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ కె. పద్మనాభం , వ్యవసాయ విస్తరణ అధికారి పి. శ్రీనివాసులు, మండలంలోని రెవిన్యూ అధికారులు మరియు గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

# కనిగిరి నుండి అరుణాచలంకు ప్రత్యేక బస్



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జూన్ 26**

కనిగిరి డిపో నుంచి గత రెండు సంవత్సరాల నుండి ప్రతి నెల పౌర్ణమి రోజులలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరుణాచలానికి సూపర్ లగ్జరీ స్పెషల్ బస్ నడుపుతున్నట్లు కనిగిరి డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం తెలిపారు. జూలై నెలలో 8వ తేదిన రాత్రి కనిగిరిలో బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కంచి, అరుణాచలం, తిరుత్తిని క్షేత్రాలను దర్శించుకొని 10తేది రాత్రికి కనిగిరికి రానున్నట్లు, రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించబడినట్లు తెలిపారు. ఒక్కొక్కరికి ఛార్జి 2200 రూపాయలు అని తెలిపారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జూన్ 26**




మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇటీవల యువత గంజాయి తదితర మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలతో అనారోగ్యం పాలై జీవితం అంధకారమవుతుందని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని,క్రమ శిక్షణతో కూడిన చదువు వలన ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. కనిగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ గంజాయి, నార్కోటిక్ డ్రగ్స్, మత్తు పానీయాల వలన జరిగే అనర్థాల గురించి వివరించారు. డ్రగ్స్ మత్తులో యువత నేడు అనేక నేరాలు చేస్తున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల సేవనం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. మాదకద్రవ్యాల గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 14405 కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి విషయాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. అనంతరం చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ఇచ్చిన మొక్కలను కళాశాల ఆవరణలో నాటరు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షేక్ ఖాసీం పీరా, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సయ్యద్ షాహిద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వి. రామరాజు, కాంట్రాక్ట్ లెక్చరర్స్ జెఏసి రాష్ట్ర చైర్మన్ కుమ్మరి కుంట సురేష్, గుడ్ హెల్ప్ డైరెక్టర్ రమేష్ బాబు,ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పాలనలో మానవ హక్కుల హననం

**- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా విమర్శ**




**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 26**

మోడీ 11 ఏళ్ల పాలన లో హద్దులేని ద్వేష పూరిత ప్రసంగాలు చేయడం, పౌర స్వేచ్ఛను అణిచివేయడం, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసి మానవ హక్కుల హననానికి పాల్పడుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా విమర్శించారు. ఒంగోలు లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో గురువారం జరిగిన విలేఖరుల సమస్యలు బిజెపి పార్టీని నిశితంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం "రాజ్యాంగ హత్య దినోత్సవం గా"జరుపుకోవాడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. మోడీ సర్కార్ తమను విమర్శించే వారిని దుర్భాష లాడుతుందని, అంతేకాదు ఉద్దేశపూర్వకంగా ద్వేషం, మత తత్వాన్ని వ్యాపింప చేస్తుందనీ, రైతాంగ సమస్యల కోసం ఉద్యమి స్తున్న రైతులని ఖాలీస్థాన్ తీవ్రవాదు లు గా ముద్ర వేసి వేధిస్తుందని, కులగనను సమర్థించే వారిని అర్బన్ నక్సల్స్ గా పేర్కొంటుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా తీవ్రంగా విమర్శించారు. ఈ దేశంలో ఉన్న 30 లక్షల మంది మైనార్టీలు తమ ప్రాణాలు ఆస్తులు పోతాయేమోనని నిత్యం, క్షణం క్షణం భయంతో జీవిస్తున్నారని, దళితులు ఇతర అనగానే వర్గాలను లక్ష్యంగా చేసుకొని ద్వేషపూరిత ప్రసంగాలు చేసే వారికి రాజకీయాల్లో ఉద్యోగాల్లో ప్రమోషన్లు దక్కుతున్నాయని సైదా తీవ్రంగా విమర్శించారు. ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత బిజెపికి లేదని వారి గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు తిప్పికొడతారని సైదా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కేకేసి చైర్మన్ కైపు వెంకటకృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ మన్నెం ప్రసన్న రాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గోరంట్ల కోటేశ్వరరావు కాకర్లపూడి వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు, ఇరిగినేని వెంకట నరసయ్య, జాకబ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ షేక్ మహబూబ్ అలీ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 26**

గిద్దలూరు లోనీ సాయి చైతన్య జూనియర్ కాలేజ్ లో డిప్యూటీ జిల్లా ప్రొహిబిషన్ , ఎక్సైజ్ అధికారి, ఆధ్వర్యంలో గిద్దలూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ, గురువారం " అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎం . జయ రావు మాట్లాడుతూ, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వాడకం శారీరకంగా, మానసికంగా, సామాజికంగా తీవ్రమైన ప్రభావాలు చూపుతాయన్నారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు పాడైపోతుందని విద్యార్థులందరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ వాటి వల్ల కలిగే దుష్పరిణామాలను వారి స్నేహితులకు కూడా తెలియజేయాలన్నారు , అదేవిధంగా ఎన్ డి పి ఎస్ చట్టం (1985) గురించి వివరించారు. మాదక ద్రవ్యాల కలిగి ఉండడం, వినియోగం, రవాణా విక్రయం అనేది శిక్షార్హమైన నేరమని స్పష్టం చేశారు. డ్రగ్స్ వాడకాన్ని నివారించడంలో కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం కలిసికట్టుగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల పట్ల అవగాహన కలిగించేందుకు విద్యార్థులతో ర్యాలీ ద్వారా ప్రచారం నిర్వహించారు. చివర్లో డ్రగ్స్ విముక్త సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు.

# విద్యార్థులతో కళకళలాడుతున్న కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల

**రోజురోజుకు పెరుగుతున్న ఫస్ట్ ఇయర్ కోర్సులలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య. ద్వితీయ సంవత్సరం కోర్సులలో కూడా చేరుకున్న విద్యార్థులు.**








**కొమరోలు పెన్ పవర్ జూన్ 25**

కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో నిండి కలకలలాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్నది. కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచి కళాశాలకు పూర్వ వైభవం సాధించి పెట్టాలనే లక్ష్యంతో గత నెల నుంచి నూతన ప్రిన్సిపాల్ సద్గుణ రావు ఆధ్వర్యంలో ఆ కళాశాలలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ బేసిక్, గెస్ట్ ఫ్యాకల్టీ, అధ్యాపకులు బోధ నేతర సిబ్బందితో కలిసి మండలంలోని దాదాపు అన్ని గ్రామాలలో పర్యటించి విద్యార్థులను కొమరోలు లోని జూనియర్ కళాశాలలో చేర్పించాలని విస్తృత ప్రచారం చేపట్టారు. తమ కళాశాలలో విద్యార్థులకు ప్రతిరోజు మధ్యాహ్నం నాణ్యమైన ,రుచి,సుచికరమైన మధ్యాహ్న భోజన సౌకర్యం కలదని, అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు పనిచేస్తున్నారని, ప్రభుత్వపరంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, తో పాటు కాలేజ్ బ్యాగులను అందిస్తున్నామని, మినరల్ వాటర్ సౌకర్యం , అన్ని రకాల ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ సద్గుణ రావు, అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ ప్రచారం సాగించారు. గత ఏడాది నిర్వహించిన పబ్లిక్ పరీక్షలలో ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన తమ కళాశాల విద్యార్థిని కదం భూ వర్షిని ఇంగ్లీష్ మీడియం ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు 453 మార్కులు సాధించిందని ,కాగా బెటర్మెంట్ పరీక్షలు రాసి మరో 10 మార్కులు పెంచుకొని 463 మార్కులతో రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంకు సాధించిందని ప్రిన్సిపాల్ సద్గురు తెలిపారు. ఈ ఏడాది సెకండ్ ఇయర్ కోర్సులలో 84 మంది విద్యార్థులు ఉన్నారని, వారితో పాటు ఇప్పటివరకు మరో ఆరు మంది కొత్త విద్యార్థులు సెకండ్ ఇయర్ కోర్సులలో చేరారని ఆయన తెలిపారు. ఫస్టియర్ విద్యార్థుల కొరకు ఎంపీసీ, ఎం బైపిసి, బైపిసి, హెచ్ఈసి, సిఇసి గ్రూపులు ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు ఫస్ట్ ఇయర్ కోర్సులలో 65 మంది విద్యార్థులు చేరారని, ఫస్ట్ ఇయర్ విద్యార్థుల సంఖ్యను వంద నుంచి 120 వరకు పెంచాలన్నదే తమ లక్ష్యమని, ఆ దిశగా అడుగులు వేస్తూ ,ప్రచారం చేస్తూ ప్రయత్నాలు సాగిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ వారి ఉత్సవ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు తనతోపాటు తమ కళాశాల అధ్యాపకులు నిరంతరం కృషి చేస్తున్నారని ప్రిన్సిపల్ తెలిపారు .కళాశాలపై ఉన్న నమ్మకంతో విద్యార్థులు ఉత్సాహంగా కళాశాలలో చేరుతున్నారని ఆయన తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మంచి పరీక్ష ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని ప్రిన్సిపాల్ సద్గుణ రావు తెలిపారు. కళాశాలకు హాస్టల్ వసతి లేకపోవడం ,కళాశాలకు వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సుల సౌకర్యం సరిగా లేకపోవడం కళాశాలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేందుకు కొంత అసౌకర్యంగా మారుతున్నదని కళాశాల అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. కావున మండలంలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ బాల బాలికలను తమ కళాశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు తమకు సహకరించాలని ప్రిన్సిపాల్ సద్గుణ రావుతో పాటు అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



## పేట పట్టణంలోఘనంగా యాంటీ డ్రగ్స్ దినోత్సవం

**విద్యార్థులకు అవగాహన నిర్వహించిన అర్బన్ సీఐ రమేష్**





**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 26**

పట్టణంలోని అంతర్జాతీయ యాంటీ డ్రగ్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పేట పట్టణ సీఐ రమేష్ యువతకు, ముఖ్యంగా విద్యార్థులకు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే తీవ్ర పరిణామాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిలకలూరిపేట లోని బి ఆర్ ఐ జి స్కూల్‌లో నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో సీఐ రమేష్ మాట్లాడుతూ, యువత డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని గట్టిగా పిలుపునిచ్చారు.చాలా మంది యువత డ్రగ్స్‌కు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, తద్వారా చెడు మార్గాల వైపు వెళ్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇలాంటి తప్పులు చేయకూడదని, వారి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా డ్రగ్స్ నియంత్రణకు తీవ్రంగా కృషి చేస్తుందని, యువత జీవితాలు బాగుపడాలంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండడమే ఏకైక మార్గమని సీఐ రమేష్ స్పష్టం చేశారు.ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే నష్టాలను తెలియజేసి, వారిని సరైన మార్గంలో నడిపించడానికి ఎంతగానో దోహదపడతాయి. యువత తమ జీవిత విలువలను అర్థం చేసుకుని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సీఐ రమేష్ విజ్ఞప్తి చేశారు.

## జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రజావేదికని కూల్చేసిన దుర్మార్గుడు

**టిడిపి పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య**



**పెన్ పవర్, గుంటూరు, జూన్. 26**

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి తర్వాత సరిగ్గా 6 ఏళ్ల క్రితం, ఇదే రోజు మొట్టమొదటి, చివరి సారిగా గంటన్నర కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టారు. గత ఐదేళ్లలో నేరుగా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశం అదొక్కటే. ఆతరువాత అదే రోజు అమరావతిలోని కృష్ణానది కరకట్టపై అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి ఆనుకుని ఉన్న ప్రజావేదికను అప్పటి ముఖ్యమంత్రిజగన్మోహన్ రెడ్డి కూల్చివేశారు. కూల్చినా కసితీరలేదు. తీవ్రంగా మానసికంగా భాధపెట్టేలా కొంత తగలబెట్టి వదిలేశారు. అక్కడి నుండి ఆ శకలాలు కూడా తియ్యలేదు. చూసినప్పుడల్లా జగన్మోహన్ రెడ్డి భయానక పైశాచికత్వం గుర్తుకు రావాలని వదిలేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల సమస్యల కోసం ప్రజల కోసం,సుమారు రూ. 9 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ కన్వెన్షన్ హాల్‌ను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రభుత్వ కార్యక్రమాలు, సమీక్షలు, సమావేశాల నిర్వహణకు ఉపయోగిం చేది. ఆ ప్రజావేదిక కూల్చటానికి మూడు కోట్లు ఖర్చు పెట్టారు,ఈ ప్రజావేదిక కూల్చివేత అప్పట్లో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఇది కక్ష సాధింపు చర్య అని తెలుగుదేశం పార్టీ ఆరోపించగా, గత ప్రభుత్వం నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకున్నామని అప్పటి వైసీపీ ప్రభుత్వం సమర్థించుకుంది. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో ఒక ముఖ్యమైన పరిణామంగా నిలిచిపో యింది.ఇవ్వాళ అది ఒక స్మారక చిహ్నంగా ప్రజాలకోరిక మేరకు వుంచేశారు. జగన్మోహన్ రెడ్డి లాంటి సైకో కుర్చీ ఎక్కితే ఏమవుతుందో తెలియడానికి గుర్తుగా అలాగే ఉంచారు అని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు.

## ఈనెల 30న మండల సర్వసభ్య సమావేశం

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 26**

ఈనెల 30న సోమవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య తెలిపారు ఈ సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, శాశ్వత ఆహ్వానితులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు అవసరమైన సమగ్ర నివేదికతో సమావేశానికి తప్పక హాజరు కావాలని తెలిపారు.

## యాంటీ డ్రగ్ డే ర్యాలీలో ఎన్‌సిసి క్యాడెట్లు





**క్రైం రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ జూన్ 26**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ప్రకాశం జిల్లా ఎస్పి కార్యాలయం నుండి అద్దంకి బస్టాండ్ వరకు జరిగిన ర్యాలీలో 75 మంది ఎన్‌సిసి క్యాడెట్లు, 34 (ఎ) ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ మోహన్.వి, బిఎన్ ఎన్‌సిసి సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా కంభం, గిద్దలూరు, మార్కాపురం ఒంగోలులోని సంస్థలలో ర్యాలీలు, సెమినార్లు, ఉపన్యాసాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున ఎన్‌సిసి క్యాడెట్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాన్ని తిప్పి కొట్టాలి

**- పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు**

**- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్**




**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 26**

తల్లికి వందనం,పెన్షన్ల పెంపు, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణి వంటి సూపర్ 6 లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కూడా వైసిపి వారు చేస్తున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాలను తిప్పికొట్టడమే కాక ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు,ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు అన్నారు. ఒంగోలు నగరంలోని గుంటూరు రోడ్డు లోని పార్టీ కార్యాలయంలో గురువారం పరిశీలుకులు అధ్యక్షతన ఒంగోలు నగర కమిటీ, అనుబంధ సంఘాల అధ్యక్షులు,సభ్యులు నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు సభ్యులు, ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జనార్దన్ మాట్లాడుతూ పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలని, పార్టీ కోసం గత వైసీపీ ప్రభుత్వంలో పోరాడి పార్టీ కోసం కష్టపడిన వారందరికీ కమిటీల్లో న్యాయం చేస్తాను అని హామీ ఇచ్చారు. ప్రభుత్వంలోని వివిధ కార్పొరేషన్ లలో నామినేటెడ్ చేయవలసిన వారి జాబితాను రాష్ట్ర ముఖ్య మంత్రికి అందజేశానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆగష్ట్ 15 నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు సంవత్సరానికి 20,000 రూపాయలు వారి ఎకౌంట్లో వేయడం జరుగుతుందని అన్నారు. వైకాపా విధ్వంస పాలన నుండి రాష్ట్రం ప్రభుత్వం ఇప్పుడిప్పుడే గాడిలో పడుతుందని చంద్రబాబు ఇచ్చిన హామీలను అన్నీ నురవేర్చడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకులు ఇనకుండ సుబ్రహ్మణ్యం, దాసరి రాజా మాస్టర్, మోడే వెంకటేశ్వర్లు, కాకర్ల కోటయ్య, రాపర్ల జగ్గారావు, మంత్రి శ్రీనివాస రావు, శింగరాజు రాంబాబు,ఎద్దు శశికాంత్ భూషణ్,కొమ్మూరి రవిచంద్ర, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే ఇంటూరికి కృతజ్ఞతలు

### సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు





**కందుకూరు పెన్ పవర్, జూన్ 26**

పట్టణంలోని నాంచారమ్మ కాలనీకి చెందిన దాసరి మధుబాబు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆ ప్రమాదంలో మధుబాబు తీవ్రంగా గాయపడ్డారు. విషయాన్ని స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఎల్ఓసి ద్వారా సుమారు 7 లక్షల రూపాయలు మధుబాబు కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. అయితే ఎల్ఓసి వెంటనే తెప్పించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు గురువారం టిడిపి కార్యాలయానికి మధుబాబు కుటుంబ సభ్యులు వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే హాస్పిటల్లో సుమారు మధుబాబుకు 22 లక్షల రూపాయలు ఖర్చయింది. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి తప్పకుండా సీఎం రిలీఫ్ ఫండ్ తెప్పిస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో దాసరి మధుబాబు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, నాయకులు చిలకపాటి మధుబాబు, అత్తంటి శివ కృష్ణ, సవిడి బోయిన వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

## దివ్యాంగుల వద్దకు వచ్చి స్వయంగా అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే





**కందుకూరు పెన్ పవర్, జూన్ 26**

గురువారం కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఓవైపు మండల అధ్యక్షులు ఎన్నిక, మరోవైపు వ్యక్తిగత సమస్యలు వివిధ రకాల పనులపై వచ్చే ప్రజల తో కార్యాలయం కోలాహలంగా మారింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ఓవైపు ఎన్నిక నిర్వహిస్తూనే మరోవైపు అర్జీలు స్వీకరిస్తూ క్షణం తీరిక లేకుండా ఉన్నారు. ఇదే సందర్భంలో సిసి కెమెరాలలో తన కార్యాలయం బయట ఎదురుచూస్తున్న దివ్యాంగులను ఎమ్మెల్యే గమనించారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే నాగేశ్వరరావు దివ్యాంగుల వద్దకు స్వయంగా వచ్చి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో దివ్యాంగులు సంతోషంగా వెళ్లారు. ఎమ్మెల్యే దివ్యాంగుల పట్ల చూపిన అభిమానానికి ప్రత్యక్షంగా చూసిన పలువురు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును అభినందించారు.

## అనాధ శవానికి అంత్యక్రియలు

**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 26**

గిద్దలూరు రైల్వేస్టేషన్ ముందు భాగం లో చెట్టు క్రింద గుర్తు తెలియని ముదుసలి వ్యక్తి బుధవారం మృతి చెంది అనాధగా ఉండిపోయారు. అక్కడే ఉన్న ఆటో స్టాండ్ డ్రైవర్లు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు కానీ మాకు సంభంధం లేదని మిన్నకున్నారు. అయితే ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి ఎస్ నారాయణ రెడ్డి తెలుసుకొని గిద్దలూరు పోలీస్ కు సమాచారం ఇచ్చి , మున్సిపాలిటీ కార్మికుల సహకారంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.



# నిషా ముక్త భారత్ అభియాన్ పై అవగాహన ర్యాలీ

### మాదక ద్రవ్యాలపై అవగాహన పెంచాలి

### ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**కందుకూరు పెన్ పవర్, జూన్ 26:**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు మరియు అక్రమ రవాణా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కందుకూరు పట్టణంలో గురువారం నిషా ముక్త భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు డివిజనల్ పోలీస్ అధికారి వి. బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీసు సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు కందుకూరు పోలీస్ స్టేషన్ నుండి వెంగమాంబ ఫంక్షన్ హాల్ వరకు మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలన్న సంకల్పంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ, డ్రగ్స్ రహిత భారతదేశం అనే నినాదంతో చైతన్యవంతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్ తరాల ఆరోగ్యమే దేశం యొక్క నిజమైన సంపద. యువతను మాదకద్రవ్యాల వ్యసనపు ముప్పు నుండి కాపాడటమే ప్రభుత్వ బాధ్యత. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏపీ ప్రభుత్వం ఈ దిశగా గట్టి చర్యలు చేపడుతోంది. ఈ లక్ష్య సాధనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మిత్రులు, సమాజం మొత్తం భాగస్వామిగా ఉండాలి. యువతను సరైన మార్గంలో నడిపించడంలో ప్రతి ఒక్కరూ పాత్ర పోషించాలి. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వానికి తోడుగా ప్రజల సహకారం అవసరమని స్పష్టంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పోలీసు అధికారులు,విద్యార్థులు ఉపాధ్యాయులు సామాజిక కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.











# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు కృషి

## జిల్లా కలెక్టర్ అన్సారియా - పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో అవగాహన కార్యక్రమం

## డ్రగ్స్ వ్యతిరేక పోరాట ర్యాలీ ని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల



















**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 26**

యువత మాదక ద్రవ్యాల వినియోగం వైపు ప్రభావితులు కావద్దని, డ్రగ్స్ రహిత జిల్లాగా ప్రకాశం జిల్లా ను తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సంకల్పం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు, బి ఎన్ విజయ కుమార్, జిల్లా ఎస్.పి ఏ ఆర్ దామోదర్, ఎపి మాల సంక్షేమ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డా. పి. విజయకుమార్, లైవ్ స్టాక్ డెవెలప్మెంట్ ఏజెన్సీ చైర్మన్ షేక్ రియాజ్, జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా జరుపుకోవడం జరుగుచున్నదన్నారు. ఈ సందర్భంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పెద్దఎత్తున ర్యాలీలు, అవగాహన సదస్సులు జరుపుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ప్రకటించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. ప్రకాశం జిల్లాను కూడా డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువతపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా వాటి నియంత్రణే లక్ష్యంగా ప్రతి కళాశాలలో, స్కూల్స్ నందు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రకాశం జిల్లా లో కూడా ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించి కేవలం 4 నెలల కాలంలోనే ప్రకాశం జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు, అరికట్టుటకు ప్రభుత్వం పరంగా అన్నీ చర్యలు తీసుకోవడం జరుగుచున్నదని, అన్నీ వర్గాల ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాములై ప్రకాశం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లా గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉంటూ విద్యార్థుల భవిష్యత్తునకు బంగారు బాట వేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, విద్యార్థులకు సూచించారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ, డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ వినియోగం వలన కలుగు దుష్పరిణామాలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుచున్నదన్నారు. అలాగే రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టుటకు, నియంత్రించుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో 30 మందితో ఈగల అనే విభాగాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. నేడు యువత మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నారని వీటిని అరికట్టే దిశగా మాదకద్రవ్యాల నియంత్రణ పట్ల ప్రజలను చైతన్యవంతులను చేస్తూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించడం వలన నివారణ సాధ్యమవుతుందన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాల్సిన యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితం నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళుతూ చదువుపట్ల శ్రద్ధ చూపాలని సూచించారు.

సంతనూతలపాడు శాసన సభ్యులు బి ఎన్ విజయ కుమార్ మాట్లాడుతూ, జూన్ 26తేదీన అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా జరుపుకోవడం జరుగుచున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ రవాణా, వినియోగాన్ని నిర్మూలించాలన్న ఉద్దేశ్యంతో ఈగిల్ అనేలా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి డ్రగ్స్ నియంత్రణకు కృషి చేస్తున్నదన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారి భవిష్యత్తు, ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారుతుందని, దాని ప్రభావం ఆ కుటుంబం పై కూడా పడుతుందన్నారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజంలో ఉత్తమ పౌరులుగా జీవించాలన్నారు. జిల్లా ఎస్.పి ఏ ఆర్ దామోదర్ మాట్లాడుతూ, యువత కొత్తదనం పట్ల ఆకర్షితులవుతూ ఒకసారి వాడి చూద్దామనే భావనలో ఉండి డ్రగ్స్ వినియోగం దిశగా ప్రభావితులవుతారన్నారని. ఒకసారి డ్రగ్స్ కు అలవాటు పడితే వారు జైలుకు వెళ్ళడం, వారికి ఉద్యోగ అవకాశాలు పొందలేక జీవితం నాశనం అయ్యే పరిస్థితి కలుగుతుందన్నారు. మంచి భారతదేశం, మంచి ఆంధ్రప్రదేశ్ ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటూ విద్యార్థులకు, యువతకు అవగాహన కార్యక్రమాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి పాఠశాల, కళాశాలలో కమిటీలను ఏర్పాటుచేసి వారికి డ్రగ్స్ వినియోగం వలన కలుగు దుష్ఫలితాలను వివరిస్తూ పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు నియంత్రణ దిశగా అలవాటు పడిన వారిని డి - అడిక్షన్ సెంటర్లో చేర్పించడం, సరఫరా చేస్తున్న వారిని గుర్తించడం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు గంజాయిని అరికట్టుటకు ఐజి నేతృత్వంలో ప్రతి జిల్లా లో 30 మంది తో ఈగిల్ అనే విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 41 కేసులను రిజిస్టర్ చేసి 220 మందిని గుర్తించి అరెస్ట్ చేసి జైలుకు పంపడం జరిగిందన్నారు. అలాగే వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా కూడా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉండడానికి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం అనంతరం పొలిసు పరేడ్ గ్రౌండ్ నుండి అద్దంకి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు, బి ఎన్ విజయ కుమార్, జిల్లా ఎస్.పి ఏ ఆర్ దామోదర్, ఎపి మాల సంక్షేమ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డా. పి. విజయకుమార్, లైవ్ స్టాక్ డెవెలప్మెంట్ ఏజెన్సీ చైర్మన్ షేక్ రియాజ్, జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

## వృద్ధుల ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు అందించిన జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి







**పెన్ పవర్, గుంటూరు, జూన్. 26.**

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కూటమి పాలనలో సంక్షేమ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా ప్రజలకి చెప్పని సంక్షేమాన్ని సైతం ప్రజలకందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అయన కొనియాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం శ్రీనివాసరావుతోటలో వృద్దులకు, విభిన్న ప్రతిభావంతులకు రేషన్ బియ్యాన్ని , సరుకులను ఇంటింటికి తీసుకెళ్లి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ తాము పడుతున్న కష్టాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఐదు రోజులు ముందుగానే ఇంటికి బియ్యం, సరుకులు అందించేలా ఏర్పాటు చేయటంపై వృద్దులు ఆనందాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో సువరిపాలన సాగటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నార న్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ లకు వృద్దులు ఆశీస్సులు అందచేసినట్లు ఆళ్ళ హరి తెలిపారు. కార్యక్రమంలో వడ్డే సుబ్బారావు , కలపాల శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోంది





**పెన్ పవర్ చల్లపల్లి జూన్ 26**

నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ గుండేరు పనులు ప్రారంభించిన పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పూజలు చేసిన వెంకట్రామ్, డీసీ చైర్మన్ భానుప్రకాష్ ఘంటసాల కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోందని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. గురువారం ఘంటసాల మండలం ఘంటసాలపాలెంలో ఎస్.డీ.ఎం.ఎఫ్ నిధులు రూ.39.10 లక్షలతో గుండేరు మేజర్ డ్రైనేజీ పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఘంటసాలపాలెం నుంచి కొడాలి ఎస్సీ కాలనీ వరకూ 3.9 కిలోమీటర్లు పొడవున చేసే ఈ పనులను తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పూజలు చేసి ప్రారంభించారు. మండలి వెంకట్రామ్, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ వేమూరి సాయి వెంకటరమణ వాహన పూజ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సహకారంతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితో జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్స్ అండ్ మైంటెనెన్సు నిధులతో ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల పరిధిలోని అన్ని పంట కాలువలు, డ్రైనేజీలు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ నిధులతో ప్రధానమైన గుండేరు, రత్నకోడు, లింగన్న కోడు మేజర్ డ్రైనేజీలు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్రైనేజీ శాఖ డీఈఈ జే.బాబూ నాయక్, ఏఈఈ చిరంజీవి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కోన రాజశేఖర్, కూటమి నాయకులు గుత్తికొండ వరప్రసాద్, బండి పరాత్పరరావు, దాసరి సతీష్, వేమూరి రమేష్, కొండవీటి శ్రీనివాసరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పచ్చిరొట్టే ఎరువులు వాడండి

## - అధిక లాభలు పొందండి :నరసింహా రావు



**పెన్ పవర్ కారంపూడి జూన్ 26**

కారంపూడి మండలంలోని రైతులు పచ్చిరొట్టె ఎరువులు వాడి, తద్వారా భుసారాన్ని పెంచుకొని అధిక పంట దిగుబడులను, అధిక లాభాలను పొందాలని మండల వ్యవసాయ అధికారి పోట్ల నరసింహా రావు తెలియజేసారు..గురువారం కారంపూడి లోని బప్పిచర్ల గ్రామం లోని రైతులకు జిలిగాలు పంపిణి చేయటంరిగింది. జీలుగలు విత్తనాలను ప్రభుత్వం వారు 50 శాతం సబ్సిడీ పై రైతులకు అందజేస్తున్నారు. ఎకరానికి 10 నుండి 12 కిలోల విత్తనలు చల్లుకోవాలి. 30 నుండి 40 రోజుల పైరున పూత దశలో రోటోవేటర్ తో భూమిలో కలియదున్నాలి. అనంతరం 100 కేజీ సూపర్ ఫాస్పేట్ ను దుక్కిలో వేయాలి. దీని వల్ల మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్ట ఎరువులు తయారవు కుళ్లే దశలో సిటిని అందించాలి. ఒక్కో రైతునకు 50 కేజీ వరమే ఇస్తామన్నారు.. జీలుగలు మరియు పచ్చి రొట్ట ఎరువులు వాడటం వలన భూసారం పెరుగుతుంది, నత్రమని ఎరువుల వాడకం తగ్గుతుంది. భూమిలో సేంద్రియ పదార్థాలు పెరగటం వలన నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుంది, కరువు పరిస్థితులలో పంటలకు చాలా ఉపయోగ పడుతుంది. భూసారం పెరగటం వలన ఏంట దిగుబడులు పెరుగుతాయి - నేల సహఓ మిత్రులైన వానపాముల ఉధృతికి దోహద పడుతుంది. నెలలోని కరగని మూలకాలను మరియు సూక్ష్మ దాతువులను పంటలకు అదిస్తుంది.ఈ కార్యక్రమంలో గ్రామ ఉదాసిన సహాయకు రాలు రజియా. గ్రామ్ నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, పంగులూరి లక్ష్మయ్య, కర్నాటి సబ్బారావు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పిచ్చి వేషాలు వేస్తే తాటతీస్తాం..!

## -వైసీపీ చేష్టలపై ఎమ్మెల్యే జూలకంటి ఫైర్..



**మాచర్ల రూరల్: జూన్ 26 (పెన్ పవర్ న్యూస్)**

మండలంలోని ఏకోనాంపేట గ్రామంలో గురువారం మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే వద్దకు వచ్చి తాగునీటి సమస్యపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం తరుఫున వేసిన నీటి బోర్లు నుంచి చుక్క నీరు రాకుండా వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారని గ్రామ ప్రజలు ఎమ్మెల్యే వద్ద అవేదన వ్యక్తం చేశారు. అలానే నీటి పైపులను కోసి, నీటి మోటర్ ను బోరు బావిలో పడేశారని వాపోయ్యారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జూలకంటి.. ఇంత జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని విజయపూరి సౌత్ ఎస్సై అశోక్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఇటువంటి దాష్టికాలకు పాల్పడుతున్న వారిపై విచారించి, కేసు నమోదు చేయాలని కోరారు. తక్షణమే గ్రామంలో పర్యటించి, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని సూచించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని పిచ్చి వేషాలు వేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే జూలకంటి ఈ సందర్భంగా హెచ్చరించారు.

# నకిలీ విత్తనాల మాఫియాను అరికట్టాలి

## వ్యవసాయ శాఖ చీఫ్ సెక్రటరీ కి రాష్ట్ర టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు ధారు నాయక్ వినతి



**విజయపురిసౌత్: జూన్ 26 గురువారం (పెన్ పవర్)**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నకిలీ విత్తనాలు,ఎరువులు,పురుగు మందుల కల్తీ మాఫియాను అరికట్టాలని గుంటూరులో వ్యవసాయ శాఖ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ను రాష్ట్ర టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు ధారు నాయక్ గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నకిలీ విత్తనాలు,ఎరువులు,పురుగుల మందులు కల్తీ మాఫియా విచ్చలవిడిగా చెలరేగడం పై అధికారులకు వివరించారు. "ఆర్గానిక్ విత్తనాలు,ఎరువులు" పేరుతో మార్కెట్లో చలామణి అవుతున్న నకిలీ మాఫియా రైతులకు తక్కువ ధరతో ఎరువులు,పురుగుల మందులు, విత్తనాలను అందిస్తామని మాయమాటలు చెప్పి మోసాగిస్తున్నారని వ్యవసాయ శాఖ తక్షణము చర్యలు చేపట్టాలని కోరారు.అదేవిధంగా తెలంగాణ నుంచి వచ్చే నకిలీ ఎరువులు,విత్తనాల ప్రవాహాన్ని ఆపేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు ను కోరారు.

# చీరాల కుప్పటం చీరకు జాతీయ గుర్తింపు రావడం శుభపరిమాణం

**వేటపాలెం,పెన్ పవర్,జూన్ 26**

చీరాల జనసేన పార్టీ కార్యాలయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా చేనేత వికాస విభాగ ఉపాధ్యక్షులు పింజల సంతోష్ కుమార్ ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ చీరాల నియోజకవర్గానికి ఎంతోమంది ఎమ్మెల్యేలుగా పనిచేసిన ఎవరు కూడా చేనేత కళాకారుల మీద ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం జరగలేదు. చేనేతలు అంటే ఓటు బ్యాంకు లాగానే చిత్రీకరించడం జరిగినది. కానీ మద్దులూరి మాలకొండయ్య శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత ఆ విధానానికి స్వస్తి పలుకుతూ చేనేత కళా రంగం మీద ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి చేనేతల ఆర్థిక స్థితిగతులను పెంచటానికి ఉన్నటువంటి అవకాశాలు మొత్తం శోధన చేస్తూ ఆ విధానంలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాట్లుకు కృషి చేస్తూ అలానే చీరాల చేనేత ఉత్పత్తులకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీసుకురావాలనే సంకల్పంతో మొదటగా చీరాలకే ప్రసిద్ధి చెందిన కుప్పటం చీరను జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేయడం జరిగినదనీ దీనివలన జాతీయ అంతర్జాతీయ స్థాయిలో చీరాల కుప్పడం చీర ఒక ప్రత్యేకతను సంతరించుకొని తద్వారా ఉత్పత్తి పెరిగి ఈ పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి నిరుద్యోగులకు మరిన్ని అవకాశాలు కల్పించే విధంగా చేస్తుందని ఆశ భావం వ్యక్తం చేయడం జరిగింది. జాతీయ గుర్తింపు



రావడానికి ప్రత్యేక కృషి చేసినటువంటి స్థానిక శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేనేతకు బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్నటువంటి ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జౌళి శాఖా మాత్యులు సరిత చీరాల నియోజకవర్గ చేనేతల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆర్ కే నాయుడు,నూతక్కి రాకేష్, గొర్ల రఘురాం, తోట అశోక్ చక్రవర్తి మరియు జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా చేనేత వికాస విభాగ ప్రధాన కార్యదర్శి దొగుపర్తి లలిత్ కుమార్ పాల్గొనడం జరిగినది.

# పందిళ్ళపల్లి హైస్కూల్లో "డ్రగ్స్ వద్దు- ఆరోగ్యం ముద్దు" అవగాహన కార్యక్రమం





**వేటపాలెం,పెన్ పవర్,జూన్ 26**

వేటపాలెం మండలం పందిళ్ళపల్లిలో జిల్లా పరిషత్ హైస్కూల్ గురువారం "నాషా ముక్త్ భారత్ అభియాన్" డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని అంగన్ వాడి సిబ్బంది మరియు సూపర్ వైజర్ శేషమ్మ నిర్వహించారు.ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తి మాట్లాడుతూ దేశ అభివృద్ధికి పాటుపడవలసిన యువత, ఉన్నత స్థాయి ఉద్యోగులు, సినీ ప్రముఖులు డ్రగ్స్ కు బానిసలై, తమ ఆరోగ్యాన్ని చేతుల నాశనం చేసుకుంటూ, వారి ప్రభావం సమాజంపై పడి, హైస్కూల్ స్థాయి స్టూడెంట్స్ కూడా మత్తు పదార్థాలకు అలవాటు పడుతూ, తమ ఆరోగ్యాన్ని, భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారని, దీనివలన దేశ అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా "జీవితానికి హాయ్ చెప్పండి, మత్తు పదార్థాల వాడకానికి నో చెప్పండి" అనే స్లోగన్ తో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, విద్యార్థుల చేత మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

# యువత మాదకద్రవ్యాల బారిన పడకండి

**పెన్ పవర్, జూన్ 26,సంతమాగులూరు**

యువత మత్తు లో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సంతమాగులూరు సి ఐ కె వెంకట్రావు అన్నారు. . గురువారం స్థానిక బాలాజీ హైస్కూల్ మరియు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తో కలిసి తహసీల్దార్ కార్యాలయం నుండి సెంటర్ వరకు ర్యాలీ చేసి అక్కడ మానవహారం నిర్వహించారు.జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా అయన మాట్లాడుతూ యువత పెడద్రోవ పడుతుందని,డ్రగ్స్ మత్తులో యువత జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు.మద్యం,దూమపానం, డ్రగ్స్ వంటి వాటి వల్ల ప్రశాంతత కోల్పోయి జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జ్యోతిర్మయి,సంతమగులూరు ఎస్ ఐ పట్టాభి రామయ్య, బల్లికురవ ఎస్ ఐ నాగరాజు మరియు సిబ్బంది, సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.



# డ్రగ్స్‌కు విద్యార్థులు బానిసలై జీవితలు నాశనం చేసుకోవద్దు: ఎస్సై వాసు




**కారంపూడి జూన్ 26 (పెన్ పవర్)**

కారంపూడి పట్టణంలో స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మాదకద్రవ్య అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వాసు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా విద్యార్థులు తమ జీవితాలను బంగారు భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని సూచించారు. మాదకద్రవ్యం వాడిన, అక్రమంగా రవాణా చేసిన కఠినంగా శిక్షలు ఉంటాయని తమ జీవితాలు పాడు చేసుకోవద్దని,విద్యార్థి దశ నుంచే వ్యసనాలకు,మద్యానికి, మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవడంతో సమాజం పాడైపోతుందని మిమ్మల్ని నమ్ముకున్న తల్లిదండ్రులు కన్నీరు పెట్టుకుని, బజారున పడే రోజు వస్తుందని విద్యార్థులు ప్రతి ఒక్కరూ మంచి భవిష్యత్తు కోసం ప్రణాళికల రూపొందించుకోవాలన్నారు. వ్యసనాలకు లోను కాకుండా జీవితాలు బాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే కారంపూడి పట్టణంలో మాదక ద్రవ్య అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పై ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ ఎంపీడీవో గంట శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై లారీ బోల్తా: డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

## అదుపుతప్పి బోల్తా పడిన కోడిగుడ్ల లోడు లారీ

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 26:** ఒంగోలు నుంచి గుంటూరు వైపు కోడిగుడ్ల లోడుతో వెళుతున్న ఒక మినీ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.వివరాల్లోకి వెళ్తే, డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. లారీ బోల్తా పడటంతో అందులోని కోడిగుడ్లు పూర్తిగా పగిలిపోయాయి.ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను వెంటనే అంబులెన్స్ ద్వారా చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



పెన్ పవర్
గుంటూరు | బాపట్ల | పల్నాడు

## గృహాల్లో నివాసం లేకుంటే...

# ప్రభుత్వ సంకల్పం ఎలా నెరవేరుతుంది?

ఇళ్లులేనివారు బాధపడుతుంటే... ప్రభుత్వమిచ్చిన ఇళ్లలో ఉండటానికి టిడ్కో లబ్ధిదారులకు ఇబ్బందేమిటి? : ప్రత్తిపాటి.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టిడ్కో గృహాల సద్వినియోగ సమస్యపై ముఖ్యమంత్రితో మాట్లాడతాను :ప్రత్తిపాటి.

మెప్మా...డ్వాక్రా మహిళల్ని బెదిరించి అవినీతికి పాల్పడిన గొప్ప చరిత్ర గత పాలకులది : ప్రత్తిపాటి.









**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 26:** టిడ్కో గృహాల లబ్ధిదారులు వాటిలో ఎందుకు నివాసముండటం లేదని, పట్టణ పరిధిలోని పేదలకోసం గతంలో టీడీపీప్రభుత్వం 4,512 ఇళ్లు నిర్మించి మౌలికవసతులు కల్పించినా, ఇప్పటికీ 3,300 గృహాలు ఖాళీగా ఉండటం ఏమిటని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అధికారుల్ని ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన సంబంధిత అధికారులతో టిడ్కో గృహాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

**టిడ్కో గృహాల సద్వినియోగంపై ముఖ్యమంత్రితో చర్చిస్తాను...:** లక్షలు వెచ్చించి నిర్మించిన ఇళ్లలో ఉండటానికి గతంలో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నవారంతా ఎందుకు నివాసం ఉండటంలేదో వారినే అడిగి తెలుసుకోవాలని, వారు నివాసానికి విముఖంగా ఉంటే ఆ ఇళ్లను ఇతరులకు కేటాయించాలని ప్రత్తిపాటి అధికారుల్ని ఆదేశించారు. ఇళ్లలో నివాసం ఉండకపోతే... అవి పాడైపోవడంతో పాటు.. ప్రభుత్వ సంకల్పానికి చెడ్డపేరు వస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. కూటమిప్రభుత్వం వచ్చినప్పటినుంచీ లబ్ధిదారులు గృహాల్లో నివాసముండేలా అన్నిచర్యలు తీసుకుందన్నారు. రోడ్లు..వీధిదీపాల ఏర్పాటుతో పాటు మౌలిక వసతులు కల్పించినా ఇళ్లు నిరుపయోగంగా ఉంటే ఎలాగని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ఇళ్లు పొందిన వారు వాటిలో నివాసం లేకపోతే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అయినట్టేనని, మరోపక్క మరలా ఇళ్లు కావాలనే దరఖాస్తులు ప్రజల నుంచి వస్తుంటాయని ప్రత్తిపాటి తెలిపారు. ఇళ్లు నిరుపయోగంగా ఉండటమనేది కేవలం చిలకలూరిపేటకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య ఉందని ఆయన చెప్పారు. టిడ్కోగృహాల సద్వినియోగంపై ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులతో సమస్య పరిష్కారంపై చర్చిస్తానని ప్రత్తిపాటి స్పష్టంచేశారు.

**మెప్మా.. డ్వాక్రా మహిళల్ని బెదిరించి డబ్బులు కాజేసిన అవినీతి చరిత్ర గత పాలకులది..**

టిడ్కో గృహాలపై అధికారులతో సమీక్ష అనంతరం ప్రత్తిపాటి మెప్మాసిబ్బందికి ట్యాబ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెప్మా సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆర్పీలు సమర్థవంతంగా పనిచేసి కూటమిప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ప్రత్తిపాటి సూచించారు. గత ప్రభుత్వం.. ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన అవినీతి మంత్రి మెప్మా సిబ్బందిని, డ్వాక్రా మహిళల్ని కూడా దోచుకున్నారని ప్రత్తిపాటి తెలిపారు. విధుల్లో కొనసాగడానికి కాలపరిమితి ఉన్నాకూడా కావాలని సదరు అవినీతి మంత్రి గ్రూపు సభ్యుల్ని భయపెట్టి, వారినుంచి అన్యాయంగా రూ.1000 నుంచి రూ.6,000 వరకు వసూలు చేశారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెన్యువల్స్ ముసుగులో మెప్మా సిబ్బందిని, డ్వాక్రా మహిళల్నిప్రలోభపెట్టి.. వారి నుంచి అందినకాడికి అడ్డగోలుగా దోచేసి, అవినీతికి పాల్పడిన చరిత్ర గతపాలకులకే దక్కిందన్నారు.

సమావేశంలో టిడ్కో సిఓ, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, గోల్డ్ శ్రీను, నాయకులు షేక్ టీడీపీ కరీముల్లా, పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, సిఐ రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం గంజాయి..

## డ్రగ్స్‌తో యువత జీవితాలు నాశనం చేసింది..

కూటమిప్రభుత్వం గంజాయి... మాదకద్రవ్యాలకు రాష్ట్రంలో స్థానం లేకుండా చేసింది..

మెగాడీఎస్సీ అమలు.. పరిశ్రమల ఏర్పాటుతో

చంద్రబాబు యువత భవితకు ప్రాధాన్యం ఇస్తున్నారు : ప్రత్తిపాటి...







**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 26**

చిలకలూరిపేట: గత ప్రభుత్వం గంజాయి...డ్రగ్స్ కు యువతను బానిసల్ని చేసి వారి జీవితాలు నాశనం చేసిందని, కూటమిప్రభుత్వం గంజాయి కట్టడితో పాటు ఇతర మాదకద్రవ్యాలకు రాష్ట్రంలో స్థానం లేకుండా చేసిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీస్ విభాగం పట్టణంలో చేపట్టిన ర్యాలీలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ఎన్.ఆర్.టీ సెంటర్ వరకు కొనసాగిన ర్యాలీలో సిఐ రమేష్ పోలీస్ సిబ్బందితో పాటు యువత, మహిళలు పాల్గొని.. గంజాయి, మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ ముగిసిన అనంతరం యువత, మహిళలను ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు. గంజాయి.. ఇతర మాదకద్రవ్యాల సంస్కృతిని గతప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టి... అమాయకులైన యువత జీవితాలు నాశనం చేసిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టి అనేక చర్యలు తీసుకున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ఈగల్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు.. ప్రత్యేక బృందాలతో గంజాయి సాగు.. రవాణా..విక్రయాలకు అడ్డుకట్ట వేశారని, ఎక్కడా డ్రగ్స్ కనిపించకుండా చేశారని ప్రత్తిపాటి తెలిపారు. యువత భవిష్యత్ కు ప్రాధాన్యత ఇస్తూ ఇప్పటికే మెగా డీఎస్సీని అమలుచేసిన ప్రభుత్వం... పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ, .ఉపాధి కల్పనకు కృషిచేస్తోందన్నారు. మాదకద్రవ్యాల వాడకం... విక్రయాలవల్ల జరిగే అనర్థాలు యువతకు తెలియచేయడానికే నేడు పోలీస్ శాఖ ర్యాలీ చేపట్టిందని ప్రత్తిపాటి తెలిపారు. ప్రజలు.. ముఖ్యంగా యువత గంజాయి ఇతర మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో పట్టణ పోలీస్లు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, టీడీపీ నాయకులు షేక్ టీడీపీ కరీముల్లా, పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, గోల్డ్ శ్రీను, జాలాది సుబ్బారావు, బేరింగ్ మౌలాలి, కౌన్సిలర్ లు , టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కరణలు దిశగా ప్రభుత్వ పాఠశాలలు..!

## - చర్యలకు ఎమ్మెల్యే జూలకంటి ఆదేశం..!

**వెల్దుర్తి: జూన్ 26 (పెన్ పవర్)** ప్రభుత్వ విద్యలో సమూల మార్పులకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సంస్కరణకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖాధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విధి అమలు చేయవల్సిన అంశాలపై అధికారులకు ఎమ్మెల్యే దిశ నిర్ధేశం చేశారు. మన బడి – మన భవిష్యత్తు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాలలో ఎక్కడ అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. అలానే పాఠశాల పరిశరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కౌమార దశలో ఉన్న విద్యార్థులకు కెరియర్ గైడెన్స్, సోషల్ ఎవైర్నెస్ పై ప్రత్యేక అవగాహన తరగతులను నిర్వహించాలని సూచించారు.

**ప్రతి శనివారం యోగా డే ..!**

ప్రభుత్వ పాఠశాలలో ప్రతి శనివారం నిర్వహించే మాస్ డ్రిల్ లో భాగంగా విద్యార్థులతో యోగా చేయించాలని ఎమ్మెల్యే జూలకంటి సూచించారు. బాల్యంలోనే యోగాను విద్యార్థులకు పరిచయం చేయడం వలన వారి ఆరోగ్యమే కాదు కుటుంబ ఆరోగ్యం కూడా బాగుంటుందని ఆకాంక్షించారు. యోగాతో ఆరోగ్యమేకాదు.., సామాజీక చైతన్యం కూడా నిండి ఉందని.., వెంటనే ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మండల విద్యాశాఖ అధికారి అల్లి సురేష్, మాచర్ల జెడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావు, అయేషా, నాగారాజు, బాలనాగమ్మబాయి తదితరులు పాల్గొన్నారు.





# చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు

## - అద్దంకి వైసిపి ఇన్చార్జి హనిమిరెడ్డి

**పెన్ పవర్, జూన్ 26,అద్దంకి**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన రెడ్డిని ప్రజలలోకి వెళ్ళనివ్వకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కుతంత్రాలు చేసి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని అద్దంకి వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ పానెం చిన్న హనిమి రెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన అద్దంకిలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైయస్ఆర్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పట్ల వెల్లువెత్తుతున్న విశేష ప్రజాదరణను చూసి తట్టుకోలేక ఆయన పర్యటనలను అడ్డుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుతంత్రాలు చేస్తోందని హనిమి రెడ్డి విమర్శించారు.కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం కల్గిస్తున్న వైయస్ జగన్ ను ప్రజల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడమే ఏకైక లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. జడ్ ప్లస్ కేటగిరి భద్రత కలిగిన మాజీ సీఎం జగన్ భద్రత ఏర్పాట్లు పట్ల కూటమి ప్రభుత్వం కుట్రపూరిత వైఖరిని అవలంభిస్తుందన్నారు.జగన్ మోహన రెడ్డి బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఏకపక్షంగా జప్తు చేయడం చంద్రబాబు సర్కార్ పన్నాగం అన్నా రు.ఏడాది పాలనలో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకు రాజకీయాల్లో భాగంగా ప్రభుత్వం తాజాగా జగన్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని జప్తుచేయడం జరిగిందన్నారు.కేసు దర్యాప్తు పేరిట బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సుదీర్ఘ కాలం జప్తులో ఉంచేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఇంచార్జ్ హనిమి రెడ్డి ఆరోపించారు. సింగయ్య మృతి ఉదంతాన్ని వక్రీకరిస్తూ నమోదుచేసిన అక్రమ కేసు పైన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ న్యాయపోరాటం చేస్తుందని ఇంచార్జ్ హనిమి రెడ్డి అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఎంత విస్తృతంగా పర్యటిస్తే తమ ప్రభుత్వ వైఫల్యాలు అంతగా వెలుగులోకి వస్తాయని టీడీపీ పెద్దల భయపడుతున్నారన్నారు.



జగన్ పర్యటనలకు దారి పొడవునా వేలాది మంది జనం తరలివస్తుండటం చూసి ఓర్వలేక కూటమి నాయకులను కలవర పరుస్తుందన్నారు. ఆ అక్కసుతోనే వైయస్ జగన్ ని భూస్థాపితం చేస్తానని సీఎం చంద్రబాబు ఇటీవల మీడియా లో జరిపిన ఇంటర్వ్యూలో ప్రకటించటం తెలిసిందే అన్నారు. రాజకీయాలకు అతీతంగా మాజీ ముఖ్యమంత్రికి పటిష్ట భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని,40 ఏళ్ల సీనియర్ నాయకుడినని తరుచూ చెప్పుకొనే చంద్రబాబు పూర్తి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని హనిమి రెడ్డి ఏద్దేవా చేశారు.

# జగన్‌లో అప్పటి ఊపు... ఉత్సాహం ఇప్పుడెక్కడ ... ?



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిలో ఊపు ఉత్సాహం కరువైందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. సహజంగా జగన్ రాజకీయంగా ఏం మాట్లాడినా.. ఎవరిపై విమర్శలు చేసినా చాలా ఉత్సాహంగా ఉంటారు. ఉత్సాహంగా వ్యాఖ్యానిస్తారు. కానీ, తాజాగా బుధవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాత్రం ఆయన చాలా నిరుత్సాహంగా కనిపించారు. ఆయన మాట్లాడే విధానం, మాట్లాడే తీరు గమనిస్తే జగన్లో స్పష్టంగా తేడా కనిపించింది. మరి ఈ తేడా ఎందుకు వచ్చింది.. అంటే ప్రస్తుతం ఆయన చుట్టూ అనేక కేసులు ముసురుకున్నాయి. ప్రధానంగా ఆయన ఇంటి నుంచి కారును పోలీసులు తీసుకువెళ్లడంపై మానసికంగా ఆయన ఇబ్బంది పడుతున్నట్టు తెలుస్తోంది. సహజంగా కేసు పెట్టి అందులో జగన్ పేరు చేర్చడంపై కంటే కూడా వ్యక్తిగతంగా ఆయన ఇంటి నుంచి కారు తీసుకెళ్లడాన్ని జగన్ కొంచెం ఫీల్ అవుతున్నారని సమాచారం. దీనికి తోడు పార్టీ నాయకుల పై వరుసగా నమోదు అవుతున్న కేసులు కూడా జగన్‌ను ఇబ్బంది పెడుతున్నాయి. పైకి గంభీరంగా ఉన్నా.. అరెస్టయిన వారిని బయటకు తీసుకురాలేని పరిస్థితి వంటి పరిణామాలు కూడా మానసికంగా జగన్ ను కుంగ తీస్తున్నాయని చెప్పాలి. సహజంగా ధైర్యం, సాహసం వంటి వాటికి జగన్ పేరును పర్యాయపదంగా చెబుతారు. కానీ, మారుతున్న కాలం.. మారుతున్న పరిస్థితులు వంటివి జగన్ను ఆ దిశగా నడిపించడంలో కాస్త వెనుకబాటు కనిపించింది. ఇదే సమయంలో నిరుత్సాహానికి కారణం కూడా అదేనని చెప్పాలి. దీనికి తోడు ఏడాది కాలంలో కూటమిలో అనైక్యత చోటు చేసుకుంటుందని అనుకున్నారు. అంతేకాదు.. ఎక్కడో ఒక చోట విభేదాలు వస్తాయని జగన్ అంచనా వేసుకున్నారు. కానీ అలా జరగలేదు. పైగా కూటమి బలంగా ఉందన్న సంకేతాలు తాజాగా జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. ఇది కూడా జగన్కు మానసిక ఆవేదనను పెంచిందని చెప్పాలి. ఎలా చూసుకున్నా రాజకీయంగా జగన్ కి ఇప్పుడు ఒక సంక్లిష్ట పరిస్థితి అయితే ఏర్పడిందనేది పరిశీలకులు చెబుతున్న మాట. అందుకే ఆయనలో ఊపు, ఉత్సాహం కొరవడిందని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# 'సుపరిపాలన' ప్రోగ్రాంకి వెళ్లుంటే వెనక్కి వచ్చేసేవాడిని.. రఘురామ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏడాది పాలన సందర్భంగా ఇటీవల అమరావతిలో కూటమి ప్రభుత్వం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఘనంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఏపీబీజేపీ చీఫ్ పురందేశ్వరి, మంత్రి లోకేష్.. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఇదే సమయంలో.. ఈ ప్రతిష్టాత్మకమైన 'సుపరిపాలనలో తొలి అడుగు' సదస్సుకు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు! అయితే... ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందంటూ ఉండి ఎమ్మెల్యే, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కీలక వ్యాఖ్యలు చేశారు. అవును... అమరావతిలో ఇటీవల అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందని ఏపీ శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు అన్నారు. ఈ సందర్భంగా... ప్రొటోకాల్ ఉల్లంఘన ప్రభుత్వ పెద్దలకు తెలిసే జరిగిందో.. లేదో నాకు తెలియదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కలెక్టర్ కంటే ఎమ్మెల్యే ప్రొటోకాల్ పెద్దదని తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన రఘురామ... 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ, ఎంపీని ఒక టేబుల్ వద్ద కుర్చోబెట్టారని.. మరో టెబుల్ వద్ద కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి ఎమ్మెల్యేలను కూర్చోబెట్టారని చెప్పిన ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు... ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ నిబంధనలు పాటించలేదని అన్నారు. ఇదే సమయంలో.. ఈ ప్రభుత్వ కార్యక్రమానికి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ను కూడా ఆహ్వానించాలని తెలిపారు. ఈ క్రమంలో... ఎమ్మెల్యేలకు జరిగిన అవమానంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తానని తెలిపారు. అయితే.. ఇది మొదటి తప్పుగా భావిస్తున్నట్లు చెప్పిన ఆయన... కార్యక్రమానికి వెళ్లి ఉంటే సీటింగ్ విధానం చూసి బయటకు వచ్చేసేవాడినని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సందర్భంగా.. ఆ కారక్రమంలో తమకు అవమానం జరిగిందని చాలా మంది ఎమ్మెల్యేలు తనతో చెప్పినందుకే మాట్లాడుతున్నానని చెప్పిన రఘురామ... ప్రొటోకాల్ ఉల్లంఘన ప్రభుత్వ పెద్దలకు తెలిసే జరిగిందో.. లేదో తనకు తెలియదని వ్యాఖ్యానించారు. దీంతో.. ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి!

# పార్లమెంట్ కాదు.. రాజ్యాంగమే సుప్రీం.. తేల్చిచెప్పిన చీఫ్ జస్టిస్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ప్రజాస్వామ్య పునాదులైన శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల్లో ఏది అత్యున్నతం..?? దేశ పార్లమెంటు, సుప్రీం కోర్టు.. వీటిలో ఏది అత్యున్నతం..? రాజ్యాంగం.. పార్లమెంటు.. వీటిలో ఏది ప్రధానం..? అనేకసార్లు ఇలాంటి చర్చ వచ్చింది. పలు సందర్భాల్లో తీవ్ర సంఘర్షణ కూడా తలెత్తింది. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవలే దేశ 52వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు జస్టిస్ బీఆర్ గవాయ్. మహారాష్ట్రలోని అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ గవాయ్... దేశంలో రాజ్యాంగమే అత్యుత్తమం అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలోని మూడు వ్యవస్థలు (శాసన, న్యాయ, కార్యనిర్వాహక) దీనికిందే పనిచేస్తాయని కుండబద్దలు కొట్టారు. బేసిక్ స్ట్రక్చర్ డాక్ట్రిన్ పై సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఉద్దేశించి మాట్లాడుతూ జస్టిస్ గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, రాజ్యాంగాన్ని సవరించేందుకు మాత్రమే పార్లమెంట్ కు అధికారాలు ఉనాయని... రాజ్యాంగం ప్రాథమిక రూపాన్ని మాత్రం మార్చేందుకు అధికారం లేదని స్పష్టం చేశారు. భారత ప్రజాస్వామ్యంలో శాసన (పార్లమెట్–అసెంబ్లీ), న్యాయ (కోర్టులు), కార్యనిర్వాహక (అధికార) వ్యవస్థలు ఉండగా.. నాలుగో వ్యవస్థగా మీడియాను పేర్కొంటారు. మొదటి మూడు వ్యవస్థలలో ఏది అత్యున్నతం అనే చర్చ తరచూ వస్తున్న సంగతిని జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే పార్లమెంటే అత్యున్నతం అని చాలామంది అంటారని.. రాజ్యాంగమే అత్యున్నతం అని, మిగతా మూడు విభాగాలు దానికిందనే పనిచేస్తాయని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. రాజ్యాంగం కిందనే విధులు నిర్వర్తిస్తున్నామని న్యాయమూర్తులు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని తేల్చిచెప్పారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం అని.. అధికారంతో పాటు బాధ్యతలు కూడా ఉన్నట్లు గుర్తించాలని స్పష్టం చేశారు. జడ్జిలు స్వతంత్రంగా ఆలోచించాలని.. తీర్పుల గురించి ప్రజలు ఏం అనుకుంటున్నారు? అనేది కాదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

# తెరపైకి 48వ వర్గం బ్లడ్ గ్రూప్... ఏమిటీ 'గ్వాడా నెగిటివ'?

**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా ఏ, బీ, ఏబీ, ఓ రకాల బ్లడ్ గ్రూప్స్ ని మాత్రమే ఎక్కువగా చూసే ప్రపంచంలో సరికొత్త రక్త వర్గం తెరపైకి వచ్చింది. సుమారు 15 సంవత్సరాల పరిశోధన తర్వాత ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు 48వ రక్త గ్రూపు వ్యవస్థను కనుగొన్నారు. ఈ కొత్త రక్త వర్గానికి "గ్వాడా నెగిటివ్" అని నామకరణం చేశారు. ఈ పేరు దాని మూలం యొక్క సారాంశాన్ని ప్రతిబింబిస్తుందని అంటున్నారు. అవును... శాస్తవేత్తలు తాజాగా ఒక కొత్త బ్లడ్ గ్రూప్ ను గుర్తించారు. ఫ్రెంచ్ మహిళలో ఈ కొత్త రకం రక్త వర్గాన్ని గుర్తించారు. ఆపరేషన్ కు ముందు చేసే రెగ్యులర్ పరీక్షల కోసం ఆమె రక్తనమూనాలను సేకరించి, పరీక్షించగా.. అందులో గతంలో ఎన్నడూ చూడని కొత్త వ్యత్యాసాలు కనిపించాయని అంటున్నారు. ఇదంతా తొలుత 2011లోనే ప్రారంభమైంది.



వివరాల్లోకి వెళ్తే... ఫ్రాన్స్ దేశంలోని గ్వాడెలోప్ ప్రాంతానికి చెందిన మహిళ, పారిస్ లో నివసిస్తుంది. 2011లో ఆపరేషన్ కోసం ఆస్పత్రికి వెళ్లిన 54 ఏళ్ల మహిళకు సాధారణ వైద్యపరీక్షల కోసం బ్లడ్ తీశారు. ఆ బ్లడ్ శాంపుల్స్ ని పరీక్షించిన వైద్యులకు అది అసాధారణంగా కనిపించింది. ఈ బ్లడ్ గ్రూప్, ఇతర సాధారణ బ్లడ్ గ్రూప్స్ తో ఏమాత్రం సరిపోలడం లేదు. అదేవిధంగా... ఈ రక్త వర్గంలోని యాంటీ బాడీస్ ఏ రక్తవర్గంలోనూ ఇప్పటి వరకు గుర్తించలేదు. దీంతో... ఈ అసాధారణ రక్త వర్గాన్ని గుర్తించిన వైద్యులు.. పరిశోధనల కోసం బ్లడ్ శాంపిల్స్ ను సేవ్ చేసి పెట్టారు. ఈ క్రమంలో ఎన్నో పరిశోధనలు చేసినప్పటికీ సుమారు 8 ఏళ్లపాటు ఎలాంటి ఫలితం రాలేదు. అయితే.. 2019లో మళ్లీ పరిశోధన ప్రారంభించారు. అప్పటికి అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో, దాని సహాయంతో పరిశోధన మళ్లీ ప్రారంభించారు. ఇందులో భాగంగా... హై క్వాలిటీ త్రోపుట్ డీ.ఎన్.ఏ సీక్వెన్సింగ్ సహాయంతో శాస్త్రవేత్తలు మళ్లీ రీసెర్చ్ మొదలుపెట్టారు. ఈ సమయంలో... ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న బ్లడ్ గ్రూప్స్ లో లేనటువంటి కొత్తరకం జెనిటిక్ మ్యుటేషన్ ను ఇందులో గుర్తించారు.

ఈ సందర్భంగా... సదరు మహిళ పేరెంట్స్ ఇద్దరూ అరుదైన జన్యువులను కలిగి ఉన్నారని.. ఆ అరుదైన జన్యువులే ఆమెకు వచ్చాయని.. ఈ క్రమంలో జెనిటిక్ మ్యూటేషన్ వల్ల అరుదైన రక్తవర్గం వచ్చిందని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఈ సందర్భంగా దీనికి 'గ్వాడా నెగిటివ్' అని నామకరణం చేశారు.

కాగా... ప్రపంచంలో ఇప్పటి వరకు మొత్తం 47 రకాల బ్లడ్ గ్రూప్స్ ను అధికారికంగా గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా శాస్త్రవేత్తలు 48వ రకం బ్లడ్ గ్రూప్ ను గుర్తించారు. ఈ మేరకు ఫ్రెంచ్ బ్లడ్ ఎస్టాబ్లిష్ మెంట్.. 48వ రక్తవర్గాన్ని గురించినట్లు అధికారికంగా ప్రకటించింది. ఇటీవలే ఈ బ్లడ్ గ్రూప్ కు ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్ఫ్యూజన్ (ఐ.ఎస్.బీ.టీ) గుర్తింపు లభించింది.

# టూవీలర్లకు టోల్ ఫీజు ప్రచారం: కేంద్ర మంత్రి గడ్కరీ సంచలన ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** జులై 15 నుండి నేషనల్ హైవేలపై టూవీలర్లకు కూడా టోల్ ఫీజు వసూలు చేస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో, కొన్ని వార్తాపత్రికలలో వస్తున్న వార్తలను కేంద్ర రహదారులు.. రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గట్టిగా ఖండించారు. ఈ ప్రచారం అవాస్తవం అని, ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన స్పష్టం చేశారు.

**ప్రచారంపై వివరణ**

గత కొన్ని రోజులుగా నేషనల్ హైవేలపై ద్విచక్ర వాహనాలకు కూడా టోల్ వసూలు చేస్తారన్న వార్తలు విపరీతంగా ప్రచారంలో ఉన్నాయి. ఈ వార్తలు ప్రజలలో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులలో తీవ్రమైన ఆందోళనను రేకెత్తించాయి. ఇంధన ధరలు ఇప్పటికే భారంగా మారిన నేపథ్యంలో టోల్ ఫీజు భారం మరింత పెరగనుందని చాలామంది ఆందోళన చెందారు. అయితే, ఈ వార్తలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తక్షణమే స్పందించి, వాటిని పూర్తిగా ఖండించారు.

**గడ్కరీ ప్రకటన**

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మీడియాతో మాట్లాడుతూ "టూవీలర్లకు టోల్ ఫీజు వసూలు చేయాలని ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ద్విచక్ర వాహనాలకు టోల్ ఫీజు నుండి పూర్తి మినహాయింపు కొనసాగుతుంది" అని స్పష్టంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో ద్విచక్ర వాహనదారులకు పెద్ద ఊరట లభించింది. టోల్ వసూలుకు సంబంధించి వస్తున్న వార్తలు కేవలం వదంతులు మాత్రమేనని, వాటిని నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు.



**పూర్వపు విధానం కొనసాగింపు**

భారతదేశంలో ద్విచక్ర వాహనాలకు నేషనల్ హైవేలపై టోల్ ఫీజు నుంచి ఎప్పుడూ మినహాయింపు ఉంది. ఈ మినహాయింపు కొనసాగుతుందని గడ్కరీ మరోసారి ధ్రువీకరించారు. హైవేలపై ద్విచక్ర వాహనాలకు ప్రత్యేకంగా లేన్లు ఉండకపోవడం, వాటి వేగం , భద్రత దృష్ట్యా ఈ మినహాయింపును అందిస్తున్నారు. చిన్న తరహా వాహనాలు.. సామాన్య ప్రజల ప్రయాణ సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ విధానం అమలులో ఉంది.

**ప్రచారాల పట్ల జాగ్రత్త**

సామాజిక మాధ్యమాలలో తప్పుడు సమాచారం , వదంతులు చాలా వేగంగా వ్యాపిస్తున్నాయి. ఇటువంటి ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నితిన్ గడ్కరీ పరోక్షంగా సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన అధికారిక సమాచారం కోసం విశ్వసనీయ వర్గాలను మాత్రమే అనుసరించాలని ఆయన పరోక్షంగా తెలిపారు. తప్పుడు వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని, ఏదైనా కొత్త విధానం అమలైనట్లయితే, ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తుందని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టమైన ప్రకటనతో టూవీలర్లకు టోల్ ఫీజు వసూలు అంశంపై నెలకొన్న గందరగోళం తొలగిపోయింది. ద్విచక్ర వాహనదారులకు టోల్ భారం ఉండదని, ప్రస్తుత మినహాయింపు కొనసాగుతుందని మరోసారి స్పష్టమైంది. భవిష్యత్తులో ఇటువంటి అవాస్తవ ప్రచారాలపై ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది.

# వలసదారులపై మరింత కఠిన చర్యలు.. ట్రంప్ నెక్ట్స్ నిర్ణయం ఏమిటంటే..?

**హైదరాబాద్ పెన్ పవర్:** పన్నెండు రోజుల పాటు పశ్చిమాసియాను రగిలించేసిన ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య జరిగిన భీకర యుద్ధం ముగిసిన సంగతి తెలిసిందే. ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో వాతావారణం చల్లబడింది. దీంతో యుద్ధం ముగిసిందంటూ డొనాల్డ్ ట్రంప్ పలు పోస్టులు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి స్పందించిన ఆయన.. మళ్లీ యుద్ధం రావొచ్చేమో అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

అవును... ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య యుద్ధం ముగిసి రెండు రోజులు కావొస్తుంది. పశ్చిమాసియా ఇప్పుడిప్పుడే కాస్త ప్రశాంత వాతావరణంలోకి అడుగుపెడుతోంది. ఈ సమయంలో ఇజ్రాయెల్, ఇరాన్ తో తాను చర్చలు జరిపానని.. అవి రెండూ ప్రస్తుతానికి అలిసిపోయాయని.. అయితే మళ్లీ యుద్ధ బహుశా ఏదో ఒకరోజు రావొచ్చని.. త్వరలోనే యుద్ధం మళ్లీ ప్రారంభం కావొచ్చని ట్రంప్ అన్నారు.

దీంతో... ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇజ్రాయెల్ అయితే ట్రంప్ కు చెప్పకుండా ఏ పనీ చేయకపోవచ్చు. అయితే.. ఇరాన్ ఎప్పుడు ఏమి చేస్తుందో ట్రంప్ గిల్లుడును బట్టి, ఆంక్షలను బట్టి ఉంటుందని.. ఆ ఉద్దేశ్యంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసి ఉండొచ్చని అంటున్నారు పరిశీలకులు. పైగా.. ఇరాన్ తో చర్చలవేళ ఇది ఓ బెదిరింపు హింట్ అయ్యికూడా ఉండొచ్చని చెబుతున్నారు.

ఈ సందర్భంగా ఇరాన్ తో అణు చర్చల అంశాన్ని మరోసారి ప్రస్తావించారు ట్రంప్. ఇందులో భాగంగా... వచ్చే వారం టెహ్రాన్ తో అణు చర్చలు జరుపుతామని.. అణ్వాయుధాలు తయారుచేయాలన్న ఆశయాన్ని వదిలేసేలా ఇరాన్ తో ఒప్పందం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. ఇదే సమయంలో.. ఇరాన్ పై అమెరికా దాడుల వల్లే పశ్చిమాసియాలో యుద్ధానికి త్వరగా ముగింపు పడిందని ఆయన అన్నారు. పైగా... తన నిర్ణయంతో అందరికీ విజయం లభించిందని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం. మరోవైపు.. ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించే




అవకాశాలున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇందులో భాగంగా... ప్రస్తుతం ఇరాన్ పునర్నిర్మాణానికి ఆర్థిక వనరులు కావాలని.. ఈ సమయంలో ఆ దేశం కోలుకునేలా మద్దతు ఇవ్వడం కోసం కొన్ని ఆంక్షలను సడలించే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ట్రంప్ వెల్లడించారు.

**ఇరాన్ నష్టంపై సీఐఏ క్లారిటీ!:**

ఇరాన్ లోని అణుకేంద్రాలపై ఇజ్రాయెల్ దాడివల్ల పెద్ద నష్టం ఏమీ జరగలేదని ఒకరంటే.. రెండు మూడు నెలల్లో ఇరాన్ మళ్లీ పని మొదలుపెడుతుందని మరొకరు అన్నారు. అయితే... ఇప్పట్లో ఇరాన్ తేరుకోలేదని అమెరికా, ఇజ్రాయెల్ లు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీ.ఐ.ఏ) ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది.

ఇందులో భాగంగా... ఇటీవల జరిగిన దాడుల్లో ఇరాన్ అణు కార్యక్రమం తీవ్రంగా దెబ్బతిన్నట్లు నమ్మకమైన ఇంటెలిజెన్స్ విభాగం ఒకటి వెల్లడించిందని.. మరిన్ని వివరాలను తాము సేకరించి పాలకులకు అందిస్తామని.. అమెరికా ప్రజలకూ తెలియజేస్తామని.. జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశం కావడంతో పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తామని సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్ క్లిఫ్ ప్రెస్ నోట్లో పేర్కొన్నారు.

**మరోసారి క్లారిటీ ఇచ్చిన ట్రంప్:**

ఇదే విషయంపై ట్రంప్ నాటో సదస్సు వేదికగా మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఇందులో భాగంగా.. ఇజ్రాయెల్ మనుషులు అక్కడికి వెళ్లి పరిశీలించి పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిపారని.. ఇప్పుడు ఇజ్రాయెల్ దానిపై ఓ నివేదిక తయారుచేస్తోందని.. పూర్తిగా ధ్వంసమైందని వారు చెప్పడంతోపాటు.. తాను కూడా నమ్ముతున్నానని.. అక్కడ (ఇరాన్ అణు కేంద్రాల్లో) ఏదీ మిగిలే అవకాశం లేదని ట్రంప్ పేర్కొన్నారు.

# టెస్ట్ క్రికెట్‌లోనూ స్టాప్ క్లాక్.. ఐసీసీ ప్రకటించిన ఐదు కొత్త రూల్స్ ఇవే



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మెన్స్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఐదు కొత్త రూల్స్ తీసుకొని వచ్చింది. గురువారం (జూన్ 26) ప్రకటించిన ఈ రూల్స్ లో టెస్ట్ క్రికెట్ పై ఫోకస్ చేస్తూ రూల్స్ ప్రకటించింది. గత వారం కంకషన్ సబ్‌స్టిట్యూట్ లో గందరగోళాన్ని తొలగించగా.. వన్డే ఫార్మాట్ లో బ్యాట్, బంతికి మధ్య కాంటెస్ట్ రసవత్తరంగా మార్చాలని కొత్త బంతి పై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. తాజాగా టెస్ట్ క్రికెట్ లో స్టాప్ క్లాక్ రూల్.. డీఆర్ఎస్ విధానంపై మార్పులు చేస్తూ కీలక రూల్స్ ప్రకటించింది. ఈ రూల్స్ మూడు ఫార్మాట్ లకు వర్తిస్తాయి. ఐసీసీ కొత్తగా ప్రవేశ పెట్టిన రూల్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.

**టెస్ట్ క్రికెట్ లో స్టాప్ క్లాక్:**

స్టాప్ క్లాక్ రూల్ ఇప్పటివరకు వన్డే, టీ20 ఫార్మాట్ లో మాత్రమే ఉంది. ఈ రూల్ ను ఐసీసీ టెస్టుల్లోనూ చేర్చింది. టెస్ట్ మ్యాచ్‌లలో స్లో ఓవర్ రేట్ల సమస్యను పరిష్కరించడానికి ఐసీసీ స్టాప్ క్లాక్‌ను ప్రవేశపెట్టింది. ఈ రూల్ ప్రకారం ఫీల్డింగ్ చేస్తున్న జట్టు మునుపటి ఓవర్ ముగిసిన 60 సెకన్లలోపు కొత్త ఓవర్‌ను ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆలస్యమైతే అంపైర్లు వార్నింగ్ ఇస్తారు. రెండు సార్లు కంటే అంపైర్ ఎక్కువసారి వార్నింగ్ ఇచ్చినట్లయితే బ్యాటింగ్ చేసే జట్టుకు 5 పరుగుల పెనాల్టీ ఇస్తారు. ప్రతి 80 ఓవర్లకు గడియారం రీసెట్ అవుతుంది. ఈ మార్పు ఇప్పటికే ప్రస్తుత వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ సైకిల్‌లో ఉపయోగిస్తున్నారు.

**లాలాజల నియమం సడలించబడింది:**

బంతిపై లాలాజలం వాడకంపై నిషేధం తొలగించిన సంగతి తెలిసిందే. అయితే దీన్ని అడ్వాంటేజ్ గా తీసుకొని ఫీల్డింఫ్ చేస్తున్న జట్టు బంతి స్వరూపాన్ని మార్చి కొత్త బంతిని తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇకపై అలా జరగడానికి వీలు లేదు. అంపైర్లు బంతిని స్థితిని గమనించి.. బంతి పరిస్థితి గణనీయంగా మారిందని అంపైర్లు నిర్ధారించినట్లయితే బంతిని మారుస్తారు. లాలాజలాన్ని బలవంతంగా బంతిపై రుద్దడానికి వీలు లేదు. ఉద్దేశ్యపూర్వకంగా ఎవరైనా అలా చేస్తే బ్యాటింగ్ జట్టుకు 5 పరుగుల పెనాల్టీ విధిస్తారు.

**DRS విధానంలో కొత్త మార్పు:**

ఈ రూల్ ప్రకారం (ఉదాహరణకు) ఫీల్డింగ్ చేస్తున్న జట్టు క్యాచ్ కోసం అప్పీల్ చేస్తుంది. ఈ సమయంలో అంపైర్ ఔటిస్తే బ్యాటింగ్ చేసే జట్టు క్యాచ్ అప్పీల్ కోసం రివ్యూ కోరుతుంది. ఈ సమయంలో థర్డ్ అంపైర్ మొదట అల్ట్రాఎడ్జ్ చెక్ చేస్తారు. ఒకవేళ బంతి బ్యాట్ కు తగలేకపోతే ఎల్బీడబ్ల్యూ కోసం అంపైర్ చెక్ చేస్తారు. ఎల్బీడబ్ల్యూలో ఔట్ అని తేలినా లేకపోతే అంపైర్స్ కాల్ వచ్చినా ఔట్ గానే పరిగణిస్తారు.

**నో బాల్ లో క్లీన్ క్యాచ్ పడితే పరుగులు ఉండవు:**

సవరించిన రూల్ ప్రకారం నో బాల్ వేసినప్పుడు క్యాచ్ పడితే దాన్ని నాటౌట్ గా పరిగణిస్తారని మనకు తెలిసిందే. అయితే క్యాచ్ పట్టినప్పుడు అది క్లీన్ క్యాచా.. కాదా అని పరిశీలిస్తారు. ఒకవేళ క్లీన్ క్యాచ్ అయితే అప్పటివరకు తిరిగిన పరుగులు బ్యాటింగ్ జట్టుకు జత చేయరు. కేవలం నో-బాల్ పరుగు మాత్రమే బ్యాటింగ్ జట్టు స్కోరుకు జోడించబడుతుంది. ఒకవేళ క్లీన్ క్యాచ్ కాకపోతే బ్యాటర్లు పూర్తి చేసిన పరుగులను జట్టు స్కోర్ లో జత చేస్తారు. అంతేకాదు క్యాచ్ సరిగా పట్టకుండా ఔట్ అని అప్పీల్ చేస్తే.. థర్డ్ అంపైర్ చెక్ చేశాక అది క్లీన్ క్యాచ్ కాదని నాటౌట్ గా తెలితే నో బాల్ గా ప్రకటిస్తారు.

**షార్ట్ రన్ తీస్తే భారీ మూల్యం:**

బ్యాటర్లు పరుగు పూర్తి చేసేటప్పుడు కొన్ని సందర్భాల్లో బ్యాట్ ను పూర్తిగా క్రీజ్ లో పెట్టరు. దీనినే షార్ట్ రన్ అంటారు. గతంలో ఇలా చేస్తే అంపైర్లు చెక్ చేసి ఆ రన్ ఉండదని అంపైర్లు బ్యాటర్లకు వార్నింగ్ ఇస్తారు. అయితే కొత్తగా సవరించిన రూల్స్ ప్రకారం బ్యాటర్ పరుగు పూర్తి చేసి ఇంకో పరుగు తీసే క్రమంలో క్రీజ్ లో బ్యాట్ పూర్తిగా పెట్టరో ఆ జట్టుకు 5 రన్స్ పెనాల్టీ విధించబడుతుంది. అంతేకాదు ఫీల్డింగ్ జట్టు తర్వాత బంతికి ఎవరు స్ట్రైక్ తీసుకోవాలో ఎంచుకోవచ్చు.

# ఆర్చర్ ఇన్.. బుమ్రా ఔట్: రెండో టెస్టుకు ఇంగ్లాండ్, ఇండియా జట్లలో కీలక మార్పులు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఎడ్జ్‌బాస్టన్ వేదికగా బుధవారం (జూలై 2) భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండో టెస్టు జరగనుంది. తొలి టెస్ట్ తర్వాత వారం గ్యాప్ ఇరు జట్లు రెండో టెస్ట్ ఆడడానికి సిద్ధమవుతున్నాయి. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో టీమిండియాపై ఇంగ్లాండ్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్టులోనూ గెలిచి భారత్ పై స్పష్టమైన ఆధిక్యం సంపాదించాలని ఇంగ్లాండ్ చూస్తుంటే.. తొలి టెస్టులో ఎదురైన ఓటమికి టీమిండియా ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోంది. ఈ టెస్టులో ఇండియా, ఇంగ్లాండ్ జట్లు ఒక కీలక మార్పుతో బరిలోకి దిగడం దాదాపుగా ఖాయంగా మారింది.

**రెండో టెస్టుకు బుమ్రా దూరం:**

టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా రెండో టెస్ట్ ఆడే అవకాశాలు కనిపించడం లేదు. వర్క్ లోడ్ కారణంగా సిరీస్ కు ముందే బుమ్రా 3 టెస్టులు మాత్రమే ఆడతానని చెప్పాడు. తొలి టెస్ట్ ముగిసిన తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ సైతం బుమ్రా మూడు టెస్టులు ఆడతాడని కన్ఫర్మ్ చేశాడు. ఇప్పటికే బుమ్రా ఒక టెస్ట్ ఆడాడు. మిగిలిన నాలుగు టెస్టుల్లో రెండు మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఒకవేళ బుమ్రా రెండో టెస్ట్ కూడా ఆడితే అప్పుడు చివరి మూడు టెస్టుల్లో ఒకటే టెస్ట్ ఆడాలి. దీంతో ఈ గుజరాత్ పేసర్ కు రెండో టెస్టుకు రెస్ట్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టు జట్టు యాజమాన్యం భావిస్తోందట.

లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్ లో బుమ్రా 5 వికెట్లు తీసి సత్తా చాటాడు. రెండో రోజు ఆటలో భాగంగా మూడు కీలక వికెట్లు తీసుకోగా.. మూడో రోజు మరో రెండు వికెట్లు పడగొట్టాడు. దీంతో టెస్ట్ కెరీర్ లో 14 వ సారి 5 వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఓవరాల్ గా బుమ్రా తొలి ఇన్నింగ్స్ లో 24.4 ఓవర్లు బౌలింగ్ చేసి 83 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు.

**నాలుగేళ్ళ తర్వాత ఆర్చర్ రీ ఎంట్రీ..**

ఇంగ్లాండ్ కు రెండో టెస్టుకు ముందు గుడ్ న్యూస్ అందింది. స్టార్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ రెండో టెస్ట్ కోసం ఇంగ్లాండ్ స్క్వాడ్ లో ఎంపికయ్యాడు. దీంతో నాలుగేళ్ల తర్వాత ఆర్చర్ టెస్ట్ క్రికెట్ లోకి అడుగుపెట్టబోతున్నాడు. బొటన వేలి గాయం నుంచి కోలుకొని ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో మ్యాచ్ ఆడాడు. చెస్టర్-లె-స్ట్రీట్‌లో జరిగిన కౌంటీ ఛాంపియన్‌షిప్ లో భాగంగా దర్హామ్‌తో జరిగిన మ్యాచ్‌లో ససెక్స్ తరపున ఈ స్పీడ్‌స్టర్ 14 ఓవర్లు బౌలింగ్ చేశాడు. మే 2021 తర్వాత ఆర్చర్ తన తొలి ఫస్ట్-క్లాస్ మ్యాచ్ ఆడడం విశేషం. ఈ మ్యాచ్ లో ఇబ్బందిపడకుండా బౌలింగ్ చేసిన ఈ ఇంగ్లాండ్ పేసర్.. ఒక వికెట్ కూడా తీసుకున్నాడు. ఈ స్పెల్ తో తాను రెండో టెస్టుకు రెడీ అని సంకేతాలు ఇచ్చాడు.

ఆర్చర్ తన చివరి టెస్ట్ మ్యాచ్ ను 2021 ఫిబ్రవరిలో ఆడాడు. ఆ తర్వాత మోచేయికి శస్త్రచికిత్స చేపించుకొని సుదీర్ఘ ఫార్మాట్ కు దూరమయ్యాడు. ఈ క్రమంలో 2023 లో జరిగిన యాషెస్ తో భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్ కప్ కు దూరమయ్యాడు. జూలై 2న ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌తో ఇంగ్లాండ్ రెండో టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ లో ఆర్చర్ బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ జట్టులో అనుభవం లేని ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు. ఆర్చర్ జట్టులోకి వస్తే ఇంగ్లాండ్ బౌలింగ్ సమస్యలు తీరినట్టే.

# టెస్ట్ క్రికెట్ చరిత్రలో తొలిసారి.. మ్యాచ్ మధ్యలోనే గ్రౌండ్ వదిలి వెళ్లిపోయిన అంపైర్




**హైదరాబాద్ పెన్ పవర్:** కొలంబో వేదికగా సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ లో శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య బుధవారం (జూన్ 25) రెండో టెస్ట్ ప్రారంభమైంది. ఈ టెస్టులో తొలి రోజు శ్రీలంక బౌలర్లు ఆధిపత్యం చూపించగా.. రెండో రోజు శ్రీలంక బ్యాటర్లు బంగ్లా బౌలర్ల భరతం పట్టారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 2 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసింది. క్రీజ్ లో పాతుం నిస్సాంక (146), ప్రబాత్ జయసూర్య (5) ఉన్నారు. ప్రస్తుతం శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 43 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ తొలి రోజు ఆటలో భాగంగా ఒక అనూహ్య సంఘటన జరిగింది. తొలి రోజు ఆటలో భాగంగా ఆన్ ఫీల్డ్ అంపైర్ గ్రౌండ్ వదిలి మ్యాచ్ మధ్యలోనే వెళ్ళిపోయాడు. ఆన్-ఫీల్డ్ అంపైర్ అలెక్స్ వార్ఫ్ స్థానంలో నాల్గవ అంపైర్ ప్రగీత్ రాంబుక్వెల్లా గ్రౌండ్ లోకి వచ్చాడు. అయితే దీనికి కారణం లేకపోలేదు. అలెక్స్ వార్ఫ్ ఆనారోగ్యంతో ఉండడంతో అతను గ్రౌండ్ లో ఉండలేకపోయాడు. 148 ఏళ్ళ టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక అంపైర్ ఆట మధ్యలోనే వెళ్లిపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంది. అనారోగ్యంతో ఉన్న అంపైర్ త్వరగా కోలుకుని మైదానంలోకి తిరిగి రావాలని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బంగ్లాదేశ్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఇన్నింగ్స్ 65 ఓవర్లో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ లో 247 పరుగులకు ఆలౌట్ అయింది. షాద్మాన్ ఇస్లామ్ (46), ముష్ఫికర్ రహీమ్ (35), లిటన్ దాస్ (34), మెహిదీ హసన్ మిరాజ్ (31) మెరుగ్గా ఆడటంతో తొలి రోజ ఆట ముగిసే టైమ్‌కు బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 71 ఓవర్లలో 220/8 స్కోరు చేసింది. రెండో రోజు మరో 27 పరుగులు జోడించి చివరి రెండు వికెట్లు కోల్పోయింది. అనంతరం మొదట ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 2 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసింది. పాతుం నిస్సాంక ఈ సిరీస్ లో వరుసగా రెండో సెంచరీ చేసి సత్తా చాటగా.. చండీమల్ తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు.

ఆకాంక్ష శర్మ స్లాగా గజల్ గుప్త కోచర్



# ఇంకా సైలెంట్ మోడ్‌లోనే నేచురల్ స్టార్?

ఇటీవలి ఫోటోలలో భూమి పెడ్నేకర్ మెరిసింది



నేచురల్ స్టార్ నాని ఇటీవలే %-%హిట్:ది థర్డ్ కేస్%-%తో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. శైలేష్ కొలను తెరకెక్కించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టి నాని కెరీర్‌లో మరో రూ.100 కోట్ల మూవీగా నిలిచింది. మే 1న ఐదు భాషల్లో విడుదలైన %-%హిట్ 3%-% ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. అక్కడ కూడా ఐదు భాషల్లో టాప్‌లో ట్రెండ్ కావడం తెలిసిందే. ఇదిలా ఉంటే ఈ సినిమా విడుదలై..ఓటీటీలోకి వచ్చేసినా నాని మాత్రం ఇప్పటికీ సైలెంట్ మోడ్‌లోనే ఉన్నాడు.

ఇది ఫ్యాన్స్‌ని కలవరానికి గురి చేస్తోంది. %-%హిట్ 3%-%తో బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన నాని అదే ఊపులో తదుపరి ప్రాజెక్ట్‌ని పట్టాలెక్కిస్తాడు అనుకుంటే సైలెంట్ మోడ్‌లోనే ఉండటం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ మూవీ తరువాత %-%దసరా%-% ఫేమ్ శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో నాని %-%ది ప్యారడైజ్%-% పేరుతో ఓ భారీ పాన్ ఇండయా సినిమాకు శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి గ్లింప్స్‌ని మూడు నెలల క్రితమే అంటే మార్చి 3న విడుదల చేశారు.

దీని కోసం ఏకంగా టీమ్ కోటీ ఖర్చు చేసినట్టుగా వార్తలు వినిపించాయి. సికింద్రాబాద్ లోని పారడైజ్ ఏరియాలో జరిగిన ఓ యాదార్ధ సంఘటన ఆధారంగా తెలంగాణకు చెందిన ఓ రచయిత రాసిన బుక్ ఆధారంగా ఈ సినిమాని తెరపైకి తీసుకురాబోతున్నారు. ఓ వేశ్య కొడుకు కథగా, తల్లి పంతం కోసం ఓ కొడుకు చేసిన సమరం నేపథ్యంలో ఈ సినిమాని శ్రీకాంత్ ఓదెల సెట్స్ పైకి తీసుకెళ్లబోతున్నాడు. గత కొంత కాలంగా దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది.%-%దసరా%-%ని నిర్మించిన సుధాకర్ చెరుకూరి నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ రా అండ్ రస్టిక్ కంటెంట్‌తో రూపొందబోతోందని ఇప్పటికే గ్లింప్స్‌లోని సన్నివేశాలు, డైలాగ్‌లతో స్పష్టమైంది. గ్లింప్స్ కారణంగా ఈ సినిమాపై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ప్రీ రిలీజ్ బిజినెస్‌తో పాటు నాన్ థియేట్రికల్ బిజినెస్ పరంగానూ భారీ డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఇంత వరకు దీని షూటింగ్‌కు సంబంధించిన అప్ డేట్ లేదేంటనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా నాని సైలెంట్ మోడ్‌ని వీడి ది ప్యారడైజ్ - షూటింగ్ అప్ డేట్‌ని ఇవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి నాని వారి మాటలు వింటున్నాడా? షూటింగ్ అప్ డేట్‌నిస్తాడా? అన్నది వేచి చూడాల్సిందే.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com